విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



అనకాపల్లి | సంపుటి: 3 | సంచిక: 29 | శుక్రవారం | 13-05-2025 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00

## తల్లికి వందనం జీవో ను లోకేష్ కు అందజేసిన చంద్రబాబు




**అమరావతి, పెన్ సత్తా:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా తల్లి కి వందనం పథకాన్ని అమలు చేయాలని సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు తల్లి కి వందనం జీవోలను సీఎం చంద్రబాబు అందజేశారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలన పై మంత్రి లోకేష్ తో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ఎన్డీయేకు రెండు కళ్ళన్నారు. సంపద సృష్టిస్తామని, సంక్షేమాన్ని ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని ముందుకెలా తీసుకెళ్తారని చాలా మంది ప్రశ్నించారన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తల్లి కి వందనం జీవోలను మంత్రి లోకేష్ కు అందజేశారు. సీఎం.సూపర్ సిక్స్ లో అతి కీలకం తల్లికి వందనం అని అన్నారు. ఒకరికి ఇచ్చి మిగిలిన వాళ్లకి ఇవ్వక పోవడం కరెక్ట్ కాదని భావించామని, అందుకే ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. గత ప్రభుత్వం సుమారు 42 లక్షల మందికి అమ్మ ఒడి ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం సుమారు 67 లక్ష మందికి తల్లికి వందనం ఇస్తున్నామని తెలియజేశారు. తల్లి తండ్రులు లేని పిల్లలకు గార్డియన్ ఖాతాలో వేస్తున్నామన్నారు. పారదర్శకత కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్దిదారుల జాబితా పెడతామని తెలిపారు. ఏమైనా సాంకేతిక ఇబ్బందులుంటే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీ వరకు గడువు ఉందని, ఈ నెల 30 వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఏ మాట అయితే చెప్పానో దాన్ని అమలు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటేనే ఎన్నికల్లో పోటీ చేసే అర్హత పెట్టాల్సి వస్తుందని ఈ సందర్భంగా సీఎం చమత్కరించగా, పక్కనే నవ్వుతూ కనిపించారు లోకేష్. అన్నదాత సుఖీ భవ పథకం కింద వైసీపీ ప్రభుత్వం కంటే రూ.6 వేల రూపాయలు ఎక్కువ ఇస్తున్నామన్నారు. పెన్షన్ కూడా ఒకే సారి వెయ్యి పెంచి రూ.4 వేలు ఇస్తున్నామన్నారు. బటన్ నొక్కుతున్నామని మాయమాటలు చెప్పే పెద్దలకు ఇది అర్థం కావాలంటూ పరోక్షంగా జగన్ పై చంద్రబాబు విమర్శలు గుప్పించారు.

## వాలంటీర్లు, సంక్షేమం పై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**అమరావతి పెన్ సత్తా :** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న వేళ సీఎం చంద్రబాబు, నారా లోకేష్ తో కలిసి పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో ఆయన సంక్షేమ పథకాలతో పాటు వాలంటీర్ల పైనా కీలక వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన పెన్షన్ల పెంపు గురించి మాట్లాడుతూ కేవలం ఏపీ లోనే ఇది సాధ్యమైందన్నారు. అలాగే సంక్షేమ పథకాల లబ్దిదారులకు చంద్రబాబు కీలక సూచనలు చేసారు. 2024-25 మధ్య కాలంలో 34 వేల కోట్ల పింఛన్ చెల్లించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. హామీ ఇచ్చినట్లుగానే పింఛన్ ఒకేసారి పెంచామన్నారు. ఏడాదికి రూ.34 వేల కోట్ల భరోసా పింఛన్ ఇస్తున్నది ఏపీ లోనే అన్నారు. పింఛన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరినీ గౌరవిస్తామని చంద్రబాబు తెలిపారు. తీసుకున్న డబ్బును దుబారా ఖర్చు చేయకూడదని లబ్దిదారులకు సూచించారు. సంక్షేమం పైనే ఎప్పుడూ ఆధారపడకూడదని కూడా సూచించారు. సంక్షేమాన్ని ఆర్థిక చేయూతగా మార్చు కోవాలన్నారు. అలాగే వాలంటీర్ల వ్యవస్థ పైనా చంద్రబాబు స్పందించారు. వాలంటీర్లు ఉంటేనే సాధ్యమన్నారు, కానీ ఇప్పుడు ఎక్కడుంటే అక్కడికే పింఛన్ అందిస్తున్నామని గుర్తుచేశారు. మరో వైపు వైసీపీ పై స్పందిస్తూ బాబాయిని చంపారు, నాటి సీఎం చేతుల్లోనే కత్తులు పెట్టారన్నారు. నారాసుర రక్త చరిత్ర అంటూ సాక్షి పత్రిక బరితెగించిందని ఆరోపించారు. రౌడీ షీటర్, గంజాయి బ్యాచ్ కోసం తెనాలి వెళ్లి పరామర్శించారని జగన్ పై విమర్శలు గుప్పించారు. రైతుల పరామర్శకు 15 వేల మందిని వెంట బెట్టుకుని ఎందుకు వెళ్లాలని ప్రశ్నించారు. మీ ఇంట్లో ఆడవాళ్లు ఉన్నారు కదా అమరావతి పై ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారంటూ సాక్షి డిబేట్ లో ఘటన పై వ్యాఖ్యానించారు. టాపిక్ డైవర్షన్ కోసమే పొదిలిలో పొగాకు రైతుల పరామర్శ డ్రామా అన్నారు. మరో వైపు కూటమి ఏడాది పాలన పై స్పందించిన మంత్రి నారా లోకేష్ ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే పెట్టుబడులు అన్నారు. దేశంలో లేని విధంగా అన్నక్యాంటీన్లు నడిపిస్తున్నామన్నారు. దీపం పథకం కింద గ్యాస్ సిలెండర్లు, ఆడపడుచులకు లోన్లు ఇస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని గుర్తుచేశారు. తల్లికి వందనం పథకం ప్రారంభించ బోతున్నట్లు తెలిపారు. ప్రతి తల్లి ఖాతాలో నగదును జమ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులు అన్నారు.



## జగన్ కోసం జనం అంతలా ఎందుకు దిల్లీ నేతలకు కీలక నివేదిక

**తాడేపల్లి పెన్ సత్తా :** ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంది. కూటమి లోని మూడు పార్టీలు తమ బలం పెంచుకునే ప్రయత్నాలు కొన సాగిస్తున్నాయి. టీడీపీ నేతలు వైసీపీ లక్ష్యంగా వ్యూహాలు అమలు చేస్తోంది. ఇదే సమయంలో జగన్ టీడీపీ ని టార్గెట్ చేస్తూ పోరుబాట మొదలు పెట్టారు. పరామర్శల పేరుతో జిల్లాలకు వెళ్తున్న సమయంలో భారీ జన స్పందన కనిపిస్తోంది. ఇదే ఇప్పుడ రాజకీయంగా చర్చకు కారణమైంది. ఇదే అంశం పైన దిల్లీ నేతలు సైతం ఆరా తీసినట్లు తెలుస్తోంది. కీలక అంశాలు ఈ సమయంలో రాజకీయంగా ఆసక్తిని పెంచుతున్నాయి. ఏపీలో కూటమి పాలన ఏడాది పూర్తవుతున్న వేళ 12 నెలల కాలంగా రాష్ట్రంలో పాలన, రాజకీ య అంశాల పైన చర్చ జరుగుతోంది. కాగా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో తాము సాధించిన విజయాలను ప్రజల ముందుకు తీసుకొస్తోంది. ఇక 2024 ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం అయిన జగన్ ఓటమి తరువాత, తాను అధికారంలో ఉన్న సమయంలో కేడర్ ను నిర్లక్ష్యం చేసిన జగన్ ఈ సారి ప్రాధాన్యత ఇస్తానని ప్రతీ సందర్భంలో చెబుతున్నారు. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలని భావించినా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి అయిన తరువాత వెళ్లాలని నిర్ణయించారు. మరో పక్క వైసీపీ నేతలు వరుసగా పలు కేసులలో అరెస్ట్ అవుతున్నారు. ఈ అరెస్టు ల పైన ప్రభుత్వాన్ని జగన్ టార్గెట్ చేస్తున్నారు. జగన్ ఎన్నికల్లో ఓటమి తరువాత వారంలో మూడు రోజులే తాడేపల్లిలో ఉంటున్నారు. మిగిలిన సమయం బెంగళూరులో ఉంటున్నారు. కాగా, జగన్ పరామర్శల కోసం జిల్లాలకు వెళ్లిన సమయం లో జనం నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోంది. దీని పైనే దిల్లీ నేతలు ఆరా తీసినట్లు విశ్వసనీయ సమాచారం. సర్వే సంస్థలు బీజేపీ కోసం తెర వెనుక పని చేస్తున్న ముఖ్యుల నుంచి నివేదిక లు తీసుకున్నట్లు తెలుస్తోంది. జగన్ కు 2024 ఎన్నికల్లో 40 శాతం ఓటింగ్ వచ్చింది. ఏడాది కాలంలో జగన్ కు వచ్చిన ఓటింగ్ లో మార్పు రాలేదని నివేదకలో పేర్కొనట్లు తెలుస్తోంది. అదే సమయంలో కూటమి ప్రభుత్వం పథకాల అమలు విషయంలో తాత్సారం చేయటంతో జగన్ పాలనలో పథకాలు తీసుకున్న వారంతా ఇప్పుడు అసంతృప్తితో ఉన్నట్లు గుర్తించారు. కొన్ని జిల్లాల్లో కూటమి ఎమ్మెల్యేల వ్యవహార శైలి ప్రజల్లో ఆగ్రహానికి కారణంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సూపర్ సిక్స్ అమలు చేసినా జగన్ కు తొలి నుంచి మద్దతుగా నిలిచిన ఓట్ బ్యాంక్ తమ వైపు తిప్పుకోవటం సాధ్యం కాదని టీడీపీ నేతలు సైతం అంగీకరిస్తున్నారు. కూటమిలో మూడు పార్టీల మధ్య క్షేత్ర స్థాయిలో సమన్వయం కొరవడిందని ఆ నివేదిక లో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అదే విధంగా వరుస కేసులు అరెస్ట్ లు కూడా వైసీపీ పైన కొన్ని వర్గాల ప్రజల్లో సానుభూతి పెరుగుతున్నట్లు గుర్తించిన అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. కూటమి లోని మూడు పార్టీల కేడర్ లోనూ సంతృప్తి కనిపించటం లేదనే వాదన ప్రస్తావించనట్లు తెలుస్తోంది. జగన్ టీడీపీ ఓట్ బ్యాంక్ దాదాపు సమానంగా ఉంది. కూటమితో కలవటంతో భారీ మెజార్టీ దక్కింది. తొలి నుంచి జగన్ కు మాస్ ఫాలోయింగ్ ఉన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. దీంతో, ఇప్పుడు కూటమి నేతలు జగన్ లక్ష్యంగా ఎలాంటి కొత్త వ్యూహాలు అమలు చేస్తారనేది ఆసక్తి కరంగా మారుతోంది.



# ఎయిర్ రిండియా విమాన ప్రమాదం పలు దేశాధినేతల సంతాపం

**అహ్మదాబాద్:** గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొన్ని సెకన్లకే లండన్ కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం నివాస ప్రాంతంలో కూలిపోయింది. ఆ విమానంలో 10 మంది సిబ్బందితో సహా 242 మంది ఉన్నారు. ఈ ప్రమాదంలో చాలా మంది మరణించి ఉంటారని భావిస్తున్నారు. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం (ఏ ఐ 171) టేకాఫ్ అయిన వెంటనే వేగంగా కిందకు వస్తూ కనిపించింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపం లోని మేఘానీ నగర్ ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో నల్లటి పొగ మేఘంలా పైకి లేచింది. ఎయిరిండియా ప్రకారం అహ్మదాబాద్ నుంచి లండన్ లోని గాట్విక్‌కు వెళ్తున్న విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటీష్ వారు, ఒక కెనడియన్, ఏడుగురు పోర్చుగీస్ పౌరులు ఉన్నారు. ప్రమాదంలో మరణించిన లేదా గాయపడిన వారి సంఖ్య పై ఇంకా అధికారిక అంచనా వేయబడలేదు. మేఘానీ నగర్‌కు చెందిన కొంత మంది కూడా మృతుల్లో ఉండవచ్చని భావిస్తున్నారు. గాయపడిన చాలా మందిని నగరం లోని సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు ఒక అధికారి వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ హెూంమంత్రి అమిత్ షా, పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి అహ్మదాబాద్‌కు వెళ్లి ప్రమాదంలో బాధిత ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కోరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇంతలో, అహ్మదాబాద్‌లో జరిగిన ఈ విమాన ప్రమాదం గురించి ప్రపంచం నలుమూలల నుండి సంతాప సందేశాలు వస్తున్నాయి. వీరిలో అనేక మంది దేశాధినేతలు, రాయబార కార్యాలయాలు, దౌత్యవేత్తలు, ప్రముఖులు ఉన్నారు. లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం కూలిపోవడం పై బ్రిటిష్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ సంతాపం తెలిపారు. విమానంలో మొత్తం 242 మంది ఉన్నారు, వీరిలో 53 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నారు. భారతదేశం లోని అహ్మదాబాద్ నగరంలో చాలా మంది బ్రిటిష్ పౌరులు కూలిపోతున్న విమానం లండన్ కు వస్తున్న దృశ్యం చాలా భయంకరంగా ఉంది అని స్టార్మర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్షణక్షణం నాకు సమాచారం అందుతోంది. ఈ విచారకరమైన సమయంలో ప్రయాణికులు, వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను అని ఆయన అన్నారు. యూకే మాజీ ప్రధాని రిషి సునాక్ కూడా ట్వీట్ చేశారు. ఎయిర్ ఇండియా విషాద వార్త తో నేను, అక్షత బాధపడ్డాము. మా రెండు దేశాల మధ్య ఒక ప్రత్యేకమైన బంధం ఉంది. ఈ రోజు తమ ప్రియమైన వారిని కోల్పోయిన బ్రిటిష్, భారతీయ కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి. వారి కోసం ప్రార్థనలు చేస్తున్నాం అని ట్వీట్ చేశారు. బ్రిటిష్ విదేశాంగ మంత్రి కూడా విచారం వ్యక్తం చేశారు. బ్రిటిష్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ సోషల్ మీడియాలో బాధిత ప్రజలకు తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. భారతదేశం లోని అహ్మదాబాద్‌లో జరిగిన వినాశకరమైన విమాన ప్రమాద వార్త విని చాలా బాధగా ఉంది. బాధిత ప్రజలందరికీ నా సంతాపం తెలియజేస్తున్నాను. వాస్తవాలను త్వరగా నిర్ధారించడానికి, సహాయం అందించడానికి యూకే భారతదేశం లోని స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది అని ఆయన అన్నారు. ఎమర్జెన్సీ నంబర్‌ను విడుదల చేసిన యూకే ఎఫ్సీడీవో కార్యాలయం వాస్తవాలను త్వరగా నిర్ధారించడానికి, ప్రమాద బాధితులకు సహాయం అందించడానికి భారత్ లోని స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు యూకే విదేశాంగ, కామన్వెల్త్, అభివృద్ధి కార్యాలయం(ఎఫ్సిడిఓ) వెల్లడించింది. ఈ కార్యాలయం కాన్సులర్ సహాయం కోసం సంప్రదింపుల కోసం ఎమర్జెన్సీ నంబర్‌ను కూడా విడుదల చేసింది. కాన్సులర్ సహాయం అవసరమైన లేదా స్నేహితులు లేదా కుటుంబ సభ్యుల గురించి ఆందోళన చెందుతున్న బ్రిటిష్ పౌరులు 020 7008 5000 కు కాల్ చేయాలి ఎఫ్సీడీవో కార్యాలయం పేర్కొంది. భారత్ లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ ఎక్స్ వేదికగా ఒక పోస్టును పంచుకున్నారు. అహ్మదాబాద్ నుంచి హృదయ విదారక వార్తలు వస్తున్నాయి. ఈ విషాదకరమైన పెను విపత్తు పై బాధితుల కుటుంబాలకు, ప్రియమైనవారికి, భారత ప్రజలకు, భారత ప్రభుత్వానికి నా హృదయపూర్వక సంతాపం ఈ పోస్టులో పేర్కొన్నారు.





## విమాన ప్రమాదంతో షాక్‌కు గురయ్యా చంద్రబాబు ట్వీట్

**అమరావతి పెన్ సత్తా :** అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమానం ప్రమాదంతో షాక్ కు గురైనట్లు సీఎం తెలిపారు. చనిపోయిన ప్రయాణికుల కుటుంబాలకు, సిబ్బంది కుటుంబాలకు, స్థానిక ప్రజల్లో చనిపోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. దిగ్భ్రాంతికి గురయ్యా మంత్రి లోకేష్. విమాన ప్రమాదం పై మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ నుంచి టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఎయిర్ ఇండియా లండన్ కు చెందిన బోయింగ్ డ్రీమ్ లైనర్ విషాదకరమైన ప్రమాదంతో దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఈ ఘటన పై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 242 మందితో ప్రయాణిస్తున్న విమానం మేఘని నగర్ సమీపంలో బయలుదేరిన కొద్ది నిమిషాలకే కూలిపోయిందని తెలిపారు. ఈ ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు. ఈ వినాశకరమైన సంఘటనలో మరణించిన వారి ఆత్మ శాంతి కోసం ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ారణం పై సమగ్ర దర్యాప్తును చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కేంద్రానికి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.



# సంపాదకీయం

## వేరే గ్రహం పై జీవరాశి ఉంటే అవి మనిషి కంటే తెలివైనవి అయ్యే అవకాశం ఉందా?

కొన్ని శాస్త్రీయ ఆవిష్కరణలు మన జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. ఈ అనంత విశ్వం గురించి, అందులో మనమెక్కడున్నాం అనే విషయాల్లో మన ఆలోచనలను కూడా సమూలంగా మార్చేస్తాయి. స్పేస్ క్రాఫ్ట్ మొట్ట మొదటిసారి భూమి చిత్రాలను పంపిన క్షణం అలాంటిదే. ఇప్పుడు, సముద్ర జీవరాశి వల్ల భూమి పై ఏర్పడే వాయువు (గ్యాస్) వంటి ఆనవాళ్లు కే 2-18 బి అనే మరో గ్రహం పై గుర్తించారనే వార్త కూడా అలాంటి మరో క్షణానికి దగ్గరగా ఉన్నామని చెబుతోంది. ఈ విశ్వంలో మానవులు ఏకాకులు కాదని, గ్రహాంతరవాసుల (ఏలియన్స్) నిజమైన ఉనికిని గుర్తించే క్షణం ఇంకా ఎంతో దూరంలో లేదని ఈ పరిశోధన బృందానికి నాయకత్వం వహించిన సైంటిస్ట్ చెబుతున్నారు. ప్రాథమిక ప్రశ్నలపరంగా చూస్తే ఇది చాలా పెద్ద విషయమే. కాకపోతే, మనం వాటికి సమాధానాలు చెప్పగలిగే దశలో ఉన్నామనుకోవచ్చు అని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రానమీకి చెందిన ప్రొఫెసర్ నిక్కు మధుసూధన్ అన్నారు. అయితే, అది మరిన్న ప్రశ్నలను లేవనెత్తవచ్చు. మరో గ్రహం పై జీవరాశి మనుగడ ఉందని తేలితే, అది మానవ జాతి పై ఎలాంటి ప్రభావం చూపుతుంది? వంటి ప్రశ్నలను రేకెత్తించవచ్చు. ఫ్లయింగ్ సాసర్లు, సైన్స్ ఫిక్షన్ ఏలియన్స్ మన పూర్వీకులు చాలాకాలం కిందటే గ్రహాంతర వాసుల కథలను సృష్టించారు. అంగారక గ్రహం ఉపరితలం పై ఒక సరళ రేఖ కనిపిస్తున్నట్లు ఖగోళ శాస్త్రవేత్తలు 20 వ శతాబ్దం ప్రారంభంలో భావించారు. ఇది, మనకి దగ్గర్లోని మరో గ్రహం అత్యాధునిక నాగరికతతో విలసిల్లుతుండొచ్చనే ఊహాగానాలను రేకెత్తించింది. అది గాల్లో ఎగిరే సాసర్లు, లిటిల్ గ్రీన్ ఏలియన్స్ వంటి సైన్స్ ఫిక్షన్ సంస్కృతికి దారితీసింది. కానీ దశాబ్దాల తర్వాత, ఇప్పుడు మరో గ్రహం పై జీవరాశి మనుగడ ఉందని ఇంతకుముందెన్నడూ లభ్యం కానంత బలమైన ఆధారాలు చెబుతున్నది అంగారకుడి గురించో, లేక శుక్రుడి గురించో కాదు. ట్రిలియన్ మైళ్ల దూరంలో, మరో నక్షత్రం చుట్టూ తిరుగుతున్న వేరే గ్రహం గురించి. గ్రహాంతర వాసుల ఉనికి పై జరిపే పరిశోధనలో మనం ఎక్కడ చూస్తున్నామనే విషయం తెలుసుకోవడమే అసలు సవాల్. ఇటీవలి వరకు, జీవరాశి మనుగడకు సంబంధించి నాసా దృష్టంతా అంగారక గ్రహం పై ఉంది. కానీ, 1992 లో మన సౌర వ్యవస్థకు ఆవల, మరో నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాన్ని కనుగొన్నప్పటి నుంచి ఈ ధోరణిలో మార్పు మొదలైంది. దూరంగా ఉన్న నక్షత్రాల చుట్టూ కూడా వేరే ప్రపంచాలు ఉండొచ్చని ఖగోళ శాస్త్రవేత్తలు అనుమానించినప్పటికీ, అప్పటివరకూ దానికి ఎలాంటి రుజువులూ లేవు. ఆ తర్వాతి నుంచే మన సౌరవ్యవస్థ ఆవల దాదాపు 6000 గ్రహాలను గుర్తించారు. మన సౌర వ్యవస్థ లోని గురుడు, శని వంటి వాయువులతో నిండిన గ్రహాలు కూడా వాటిలో ఉన్నాయి. అలాగే, జీవనాధారంగా భావించే నీటిజాడకు అనువైన అతి చల్లని, అతి వేడి గ్రహాలు కూడా ఉన్నాయి. కానీ, వీటిలో చాలావరకూ ఖగోళ శాస్త్రవేత్తలు గోల్డిలాక్స్ జోన్ అని పిలిచే ప్రాంతంలో ఉన్నాయి, ఈ దూరం జీవరాశి మనుగడకు అనువైనదిగా భావిస్తారు. మన గెలాక్సి లోనూ వేల సంఖ్యలో ఉండొచ్చని మధుసూదన్ విశ్వసిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికత ఎక్సోప్లానెట్లుగా పిలిచే వీటిని కనుగొనే క్రమంలో, శాస్త్రవేత్తలు వాటి వాతావరణ రసాయన కూర్పును విశ్లేషించే పరికరాలను అభివృద్ధి చేయడం ప్రారంభించారు.

సుదూర ప్రాంతాల్లోని ఆయా వాతావరణాల లోంచి ప్రసరించే నక్షత్ర కాంతిని సంగ్రహించి, అందులో భూమి పై జీవుల ద్వారా మాత్రమే ఉత్పత్తయ్యే అణువుల రసాయన ఆనవాళ్ల కోసం అధ్యయనం చేయడమే దీని ఉద్దేశం. వీటినే బయోసిగ్నేచర్లు అని పిలుస్తారు. కే 2-18 బి గ్రహం పై గ్యాస్ ను గుర్తించిన నాసాకి చెందిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్(జేడబ్ల్యూఎస్‌టీ) ఇప్పటివరకూ రూపొందించిన అత్యంత శక్తివంతమైన స్పేస్ టెలిస్కోప్. 2021లో దీని ప్రారంభ సమయం లోనే, జీవరాశి అన్వేషణలో మానవాళి తుది అంచులకు చేరిందన్న ఉత్సాహం కలిగించింది. అయితే, జేడబ్ల్యూఎస్‌టీకి కూడా పరిమితులు ఉన్నాయి. అవేంటంటే, భూమి లాంటి చిన్న చిన్న గ్రహాలను లేదా మాతృ నక్షత్రాలకు సమీపంలో ఉండే గ్రహాలను ఇవి గుర్తించలేవు. కాబట్టి 2030 లలో హాబిట్యువల్ వరల్డ్స్ అబ్జర్వేటరీ (హెచ్‌డబ్ల్యూవో - ఇది నెక్స్ట్ జనరేషన్ స్పేస్ టెలిస్కోప్)ని ప్లాన్ చేస్తోంది, ఇది భూమి లాంటి గ్రహాల వాతావరణాలను గుర్తించి, నమూనాలు సేకరించగలదు. దశాబ్దం తర్వాత, యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీకి చెందిన ఎక్స్‌ట్రీమ్లీ లార్జ్ టెలిస్కోప్ (ఈఎల్‌టీ) కూడా అందుబాటు లోకి రానుంది. దీనితో చిలీ ఎడారి పైన ఆకాశాన్ని మరింత స్పష్టంగా చూసేందుకు వీలవుతుంది. ఇది ఇప్పటివరకూ అందుబాటులో ఉన్న పరికరాల కంటే అతిపెద్ద అద్దంతో ఉంటుంది, దాని వ్యాసం 39 మీటర్లు. దీని సహాయంతో మునుపటి పరికరాల కంటే మరింత దగ్గరగా గ్రహాల వాతావరణాలను చూడొచ్చు. మరిన్ని ఆవిష్కరణలు కే 2-18బి గ్రహం చుట్టూ ఉన్న వాతావరణంలో బయోసిగ్నేచర్లను కనుగొన్నట్లు నిరూపించేందుకు వచ్చే రెండేళ్లలో తగినంత సమాచారం తమ వద్ద ఉండాలని ప్రొఫెసర్ మధుసూదన్ ఆశిస్తున్నారు. అయితే, ఆయన తన లక్ష్యాన్ని సాధించినప్పటికీ, మరో గ్రహం పై జీవరాశి ఉందన్న విషయం అందరూ పండగ చేసుకునేంత పెద్దది కాకపోవచ్చు. వేడుకలకు బదులు, బయోసిగ్నేచర్లను నిర్జీవ మార్గాల ద్వారా ఉత్పత్తి చేయొచ్చా? అనే మరో బలమైన శాస్త్రీయ చర్చకు నాంది పలుకుతుంది. అయితే, మరిన్ని వాతావరణాల నుంచి మరిన్ని నమూనాలను సేకరిస్తే, వాటి బయోసిగ్నేచర్లకు ఇదే కారణమనే ప్రత్యామ్నాయ వివరణలను కనుక్కోవడంలో రసాయన శాస్త్రవేత్తలు విఫలమైతే, అప్పుడు శాస్త్రీయ ఏకాభిప్రాయం క్రమంగా ఇతర గ్రహాలపై జీవరాశి మనుగడ ఉందనే దిశగా మారుతుందని స్కాట్లాండ్‌కి చెందిన ఆస్ట్రోనామర్ రాయల్, ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కేథరీన్ హేమాన్స్ అన్నారు. టెలిస్కోప్ లపై ఎక్కువ సమయం గడపడం వల్ల, వాతావరణ రసాయన కూర్పుల గురించి ఖగోళ శాస్త్రవేత్తలకు మరింత స్పష్టత వస్తుంది. ఇది జీవరాశి అని కచ్చితంగా మీకు తెలియకపోవచ్చు. కానీ, ఎక్కువ డేటా సేకరించినట్లయితే, అందులోనూ ఈ ఒక్క గ్రహానికి సంబంధించినది మాత్రమే కాకుండా వివిధ వాతావరణాలకు సంబంధించినదైతే, దానికి మరింత బలం చేకూరుస్తుందని భావిస్తున్నా. పెద్దగా ప్రభావం చూపని చిన్నచిన్న సాంకేతికతల అభివృద్ధి క్రమంలోనే వరల్డ్ వైడ్ వెబ్ ఆవిర్భవించింది. అదేవిధంగా, మానవాళి చరిత్రలోనే అత్యంత శాస్త్రీయ, సాంస్కృతిక, సామాజిక పరివర్తన జరిగిందని ప్రజలకు అర్థమవుతుంది. అలాగే, వివిధ స్పేస్‌క్రాఫ్ట్‌లు పంపిన సమాచారం మేరకు, మన సౌర వ్యవస్థలోనూ జీవరాశి మనుగడ, లేదా గతంలో మనుగడ సాగించిందనేందుకు శాస్త్రీయ అవకాశాలు పెరిగాయి. అందువల్ల, వివిధ మిషన్లు వాటి ఆనవాళ్ల కోసం శోధించే



పనిలో ఉన్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా, నాసా వంటి సంస్థలు వివిధ గ్రహాల పై జీవరాశి మనుగడకు సంబంధించిన ఆధారాలు కనుగొనే మిషన్ల పై పనిచేస్తున్నాయి. జీవరాశి ఉందని గుర్తించినా.. ఒకవేళ సాధారణ జీవరాశి ఉందని నిర్ధరించినా, గెలాక్సీలో అలాంటి జీవరాశి చాలా సాధారణమని భావిస్తున్నారు ప్రొఫెసర్ మధుసూదన్. కానీ, ఆ సాధారణ జీవరాశి నుంచి సంక్లిష్ట జీవరాశిగా పరిణామం చెందడం పెద్ద విషయం. అదే మరో పెద్ద ప్రశ్న కూడా అదెలా జరిగింది?, దానికి కారణమైన పరిస్థితులు ఏంటి? అవి మనకు తెలియదు. ఆ తర్వాత, తెలివితేటల వైపు పరిణామం చెందడం మరో పెద్ద విషయం అన్నారు. వేరే గ్రహం పై సాధారణ జీవరాశి కంటే, తెలివైన జీవరాశి ఆవిర్భవించడం చాలా అరుదని రాయల్ ఆస్ట్రోనామికల్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాబర్ట్ మాసే అంటున్నారు. భూమి పై జీవరాశి ఆవిర్భావాన్ని గమనిస్తే, అది చాలా సంక్లిష్టంగా ఉంటుంది. బహుళ కణ జీవం ఆవిర్భవించి, అది విభిన్న జీవరూపాలుగా పరిణామం చెందడానికి చాలా కాలం పట్టింది. ఈ పరిణామక్రమం సాధ్యం కావడానికి భూమి పై ఏముంది అనేది కూడా పెద్ద ప్రశ్న. భూమి పై ఉన్నట్లు అవే పరిస్థితులు, పరిమాణం, సముద్రాలు, భూభాగాల ఇలాంటివి ఇతర గ్రహాల పై కూడా అవసరమా?, లేదా అవేవీ లేకపోయినా జరుగుతుందా?, ఇతర గ్రహాల పై జీవరాశి కోసం శాస్త్రవేత్తలు ఇంత తీవ్రంగా అన్వేషించిన సందర్భాలు గతంలో లేవు. ఇలాంటి సాధనాలు కూడా లేవు. ఈ రంగంలో పనిచేస్తున్న చాలామందికి ఇతర గ్రహాలపై ఏలియన్స్ ఉంటే అనేదానికంటే, ఇతర గ్రహాలపై ఏలియన్స్‌ను ఎప్పుడు కనుగొన్నారనేదే ముఖ్యమని విశ్వసిస్తారు. ఏలియన్స్ ఆవిష్కరణ భయానికి బదులు ఆశ కల్పిస్తుంది అని ప్రొఫెసర్ మధుసూదన్ అన్నారు.

మనం ఆకాశం వైపు చూసినప్పుడు, భౌతికంగా కనిపించే వస్తువులు, నక్షత్రాలు, గ్రహాలతో పాటు విశాలమైన ఆకాశం కూడా కనిపిస్తుంది. దాని సామాజిక పరిణామాలు అపారమైనవి. విశ్వం వైపు నుంచి మనల్ని మనం చూసుకున్నప్పుడు అది మనలో భారీ పరివర్తన తీసుకొస్తుంది. ఇది మనల్ని మనం చూసుకునే విధానం, ఇతరులను చూసే విధానం వంటి విషయాలను సమూలంగా మార్చేస్తుంది. భాష, రాజకీయ, భౌగోళిక అడ్డంకులు తొలగిపోతాయి. మనందరం ఒకటేనని గ్రహించినప్పుడు, అందరినీ దగ్గర చేస్తుంది అని ఆయన అన్నారు.



# ప్రజా తీర్పును అపహాస్యం చేసిన జగన్

**తాడేపల్లి పెన్ సత్తా :** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు, జగన్ మధ్య తేడా స్పష్టమే. ఒకరు ప్రజాస్వామ్యాన్ని సాధనంగా చూస్తే, మరొకరు స్వార్థం కోసం దుర్వినియోగం చేశారు. చంద్రబాబు ప్రజల తీర్పును గౌరవిస్తారు, ఓడినా శిరసు వంచుతారు, ఇది పెద్ద మనసు గల నాయకుడి లక్షణం. జగన్ ఓటమి తర్వాత ప్రజల పై ఆగ్రహంగా మారారు. ఓటరు హక్కును వినియోగించిన వారినే వెన్నుపోటు దారులుగా చెప్పారు. ఇది ప్రజాస్వామ్యానికి భిన్నం, ఇందిరా గాంధీ, ఎన్టీఆర్, వాజ్ పేయిలు ఓడినా ప్రశాంతంగా ఉన్నారు. కానీ జగన్ మాత్రం ప్రతి రోజు ప్రతీకార ధోరణితో ప్రసంగిస్తున్నారు. జగన్ హయాంలో ఆరోగ్య రంగం పూర్తిగా దెబ్బతింది. రూ.8,400 కోట్లు ఖర్చు చెస్తానన్న వైద్య కళాశాలల పై కేవలం 14 శాతం మాత్రమే ఖర్చు చేశారు. ఆరోగ్య నాడు%-%నేడు కోసం రూ.12,000 కోట్లు ప్రకటించారు. కానీ కేవలం 17 శాతం మాత్రమే వినియోగించారు. ప్రజల డబ్బును గాలికొదిలేశారు. వైద్య పోస్టుల నియామకాలు వైసీపీ నేతల ఇళ్ల నుంచి వచ్చాయి. అనుమతి లేకుండా వందలాది మంది డాక్టర్లు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ వైద్యం మరింత క్షీణించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పరిస్థితిని మార్చేందుకు కృషి చేస్తోంది. చంద్రబాబు దార్శనికతతో ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే మహానాయకులు, ప్రజల పై నింద వేయడం మాకు వద్దు, ప్రజల సంక్షేమం కోసమే సేవ చేస్తాం.





# ఫార్మాలో సేఫ్టీ అధికారులే మరణిస్తే, సిబ్బంది పరిస్థితి ఏంటి

## -ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల మరణాలకు కారణం ఎవరు?

## -కంపెనీలలో అసలేం జరుగుతోంది?

**పరవాడ పెన్ సత్తా జూన్ 12:** ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలకు, మరణాలకు అంతుండడం లేదు. ఫార్మాసిటీ లోని కంపెనీల్లో పనిచేసే కార్మికులు కుటుంబ జీవన భృతి కోసం కాక, కుటుంబానికి జీవిత నష్ట పరిహారం ఇప్పించడానికి ఫార్మా సంస్థల్లో పనిచేస్తున్నట్లు ఉంది. ఫార్మా సంస్థలలో భద్రతా ప్రమాణాలు ఎవరూ పాటించడం లేదు. తనిఖీ చేయాల్సిన విభాగాల అధికారులు చోద్యం చూస్తున్నాయి. తాజాగా సాయి శ్రేయాస్ ఫార్మా కంపెనీలో ఏకంగా మందుల తయారీ ప్రక్రియను పర్యవేక్షించే భద్రతా విభాగం అధికారులే ప్రాణాలు కోల్పోయారంటే అక్కడి పరిస్థితులు ఏమిటో ఆలోచించాల్సి ఉంది. పరవాడ లోని విశాఖ ఫార్మా సిటీ (రాంకీ)లోని సాయిశ్రేయాస్ మందుల తయారీ కంపెనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత విషవాయువు పీల్చి ఇద్దరు ఉద్యోగులు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. చనిపోయిన వారిలో పగిరి చంద్రశేఖర్ (32) సేఫ్టీ విభాగంలో అసిస్టెంట్



మేనేజర్ కాగా మరొకరు శరగడం కుమార్ (25) సేఫ్టీ షిఫ్ట్ ఆఫీసర్. అంటే ఇద్దరూ భద్రతా విభాగంలో కీలక ఉద్యోగులే. వారే మరణించారంటే అక్కడ ఏమి జరిగినట్టు..? భద్రతా ప్రమాణాలు ఎంత వరకు పాటిస్తున్నట్టు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కీలక మైన వ్యాధికి సంబంధించిన ఇంటర్మీడియట్ మందు తయారు చేస్తుండగా ఆ బ్యాచ్ ఫెయిల్ అయింది. అది ప్రమాదకరమైన వ్యర్థం కావడం వల్ల ఎఫ్లూయెంట్ ట్రీట్ మెంట్ ప్లాంటు (ఈటీపీ)లోకి పంపకుండా వేరే ట్యాంక్ లోకి గానీ రియాక్టర్ లోకి గానీ తీసి, దానిని ట్రీట్‌మెంట్ చేసి రాంకీ ఫార్మాసిటీలో వ్యర్థాల శుద్ధి కర్మాగారానికి పంపాలి. కానీ సాయి శ్రేయాస్ సిబ్బంది అలా చేయలేదు. ఆ వ్యర్థాలను నేరుగా ఈటీపీ లోకి పంపించేశారు. అప్పటికే అందులో ఉన్న వ్యర్థాలతో కలిపి దానిని డైల్యూట్ చేసే ప్రక్రియ చేపట్టారు. ఆ సమయంలో ఈటీపీ కి ఉన్న మ్యాన్ హోల్స్‌ను మూసివేయాలి, కానీ తెరిచి ఉంచారు. అంటే నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఆ ప్రక్రియ జరుగుతున్నప్పుడు హెచ్2ఎస్ (హైడ్రోజన్ సల్ఫైడ్) విడుదలైంది. ఇది కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తుంది. దీనిని ఎక్కువ పీలిస్తే కోమాలోకి వెళ్లి, ప్రాణాలు కూడా పోతాయి, ఇక్కడ అదే జరిగింది. రాత్రి షిఫ్ట్‌లో ఉన్న సేఫ్టీ ఆఫీసర్లు ఇద్దరూ మరో వర్కర్ బన్సాల్ ని తీసుకొని డైల్యూషన్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో చూడడానికి ఈటీపీ పైకి వెళ్లారు. అప్పటికే హెచ్2ఎస్ అక్కడ వ్యాపించి ఉండడంతో ఆ ఘాటైన వాయువు పీల్చి మరణించారు. వర్కర్ బన్సాల్ స్పృహ కోల్పోయాడు. ఈటీపీ వద్దకు వెళుతున్నప్పుడు అక్కడ ఏ ప్రక్రియ జరుగుతున్నదో తెలుసు కాబట్టి దానికి తగిన రక్షణ పరికరాలు ధరించి వెళ్లాలి. అంటే మంచి మాస్క్ కచ్చితంగా ధరించాలి. అది విష వాయువుల నుంచి రక్షణ కల్పించేదై ఉండాలి. హెచ్2ఎస్‌ను వాసనను బట్టి గుర్తు పట్టవచ్చు. మ్యాన్ హోల్ తెరిచి ఉంది కాబట్టి ఈటీపీ పైకి వెళుతున్నప్పుడే ఆ వాసన వస్తుంది. అంటే దానిని గుర్తు పట్టే స్థితితో సేఫ్టీ అధికారులు ఉండాలి, వారు ఆ వాసన గుర్తు పట్టి కిందికి దిగిపోవాలి, కానీ అలా జరగలేదు. ప్రతి సంస్థ తయారు చేసే మందులను బట్టి స్టాండర్ట్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) పాటించాలి. మందుల తయారీ ప్రాంతంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బందికి అవగాహన కల్పించి, తగిన భద్రతా పరికరాలు అందించాలి. అంటే మాస్కులు, గ్లౌజులు, బూట్లు వంటివి అందులో భాగంగా ఉంటాయి. ఈ ప్రమాదం పై కంపెనీ యాజమాన్యం, పోలీసులు విషవాయువు లీకై దానిని పీల్చి చనిపోయారని చెబుతున్నారు. ఇంకే విషయాలు వెల్లడించడం లేదు. ఈ ప్రమాదం నిర్లక్ష్యం వల్ల జరిగింది అని అర్థమవుతోంది. ఈటీపీ లోనే వ్యర్థాలను శుద్ధి చేయకూడదు. వేరే ట్యాంకులోకి తీసుకొని చేయాలి. కానీ వారు అలా చేయలేదు. పైగా మ్యాన్‌హోల్ తెరిచి ఉంచారు. అది మూసి ఉంటేనే ప్రక్రియ సజావుగా జరుగుతుంది. అక్కడ నిబంధనల ప్రకారం వ్యవహరించలేదు. నిర్లక్ష్యం ఉందని అర్థమవు తోంది. పైగా చనిపోయిన వారిలో ఒకరికి సేఫ్టీ విభాగంలో పదేళ్ల అనుభవం ఉంది. ఈ ప్రమాదం పై పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే, కార్మికుల మరణాలకు అధికారులే బాద్యులు అని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదం పై ప్రభుత్వం, పోలీసులు సమగ్ర విచారణ చేసి కంపెనీ పై కఠిన చారులు తీసుకోవాలి అని కార్మిక సంఘాలు డిమాండ్ చేసారు.









## మధ్యాహ్నం భోజన పదకంలో సన్న బియ్యంతో భోజనం ప్రారంభం కలెక్టర్

అనకాపల్లి,పెన్ సత్తా, జూన్12బీ డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గురువారం నుండి అన్ని ప్రభుత్వ స్కూల్స్, కాలేజిల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు, ఎస్సీ, ఎస్టీ, బి సి, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు మరింత నాణ్యతగా భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్లకు గాను అవసరమైన సన్న బియ్యం పౌర సరఫరాల సంస్థకు సంబంధించిన 15 మండల స్థాయి గోదాముల నుండి గురువారం నాడు జిల్లా వ్యాప్తంగా 1,418 ప్రభుత్వ పాఠశాలలు, 136 ఎస్సీ, ఎస్టీ, బి సి, సంక్షేమ హాస్టల్స్ కు 16,898 ప్యాకేట్లు నాణ్యమైన సన్న బియ్యం 25 కేజీల సంచుల్లో పంపిణి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. దీని నిమిత్తం ప్రతి బస్తాకు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసి సన్న బియ్యనికి సంబందించిన సమాచారం మొత్తం రైతు వివరము నుండి టెక్నికల్ అసిస్టెంట్ సంబందించిన వివరాలు పొందుపరచడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆ ప్రకటనలో తెలిపారు.



## పెద్ద ఎత్తున ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం

బాపట్ల పెన్ సత్తా, జూన్ 12:- బాపట్ల పట్టణంలోని ఒక గూడెంలో గురువారం బాపట్ల మునిసిపల్ కమీషనర్ జి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు నజీర్, సీహెచ్ కరుణ పెద్ద ఎత్తున ప్లాస్టిక్ గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు.



## విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేత

బాపట్ల, పెన్ సత్తా, జూన్ 12:- బాపట్ల పట్టణం భీమావారిపాలెం పార్కు దగ్గర పట్టణానికి చెందిన సమాజ సేవకురాలు బండ్రేడ్డి రజని విద్యార్థులకు నోటు పుస్తకాలు మరియు పెన్నులను అందజేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభం అయిన సందర్బంగా విద్యార్థులు రోజు పాఠశాలకి వెళ్లి చక్కగా చదువుకోవాలన్నారు.



## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు శాంతియుత ర్యాలీ

బాపట్ల, పెన్ సత్తా, జూన్ 12:- బాపట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు బాపట్ల పట్టణంలోని రథంబజార్ లో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ కార్యక్రమం నిర్వహింస్తున్నట్లు వైసీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చెంచయ్య తెలిపారు.గురువారం బాపట్ల పట్టణ వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి చేసుకున్న కూడా ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ఇంత వరకు ఇచ్చిన హామీలను పూర్తి చేయనందున వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున సూచనల మేరకు ఈ శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ర్యాలీ అనంతరం బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కి వినతి పత్రం అందజేయనున్నట్లు చెంచయ్య తెలిపారు.కావున బాపట్ల జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ శాంతియుత ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా వేడుకలు





అనకాపల్లి పెన్ సత్తా జూన్ 12: లక్ష్మీనారాయణ నగర్ లో గల పార్టీ కార్యాలయంలో రాష్ట్రం లోని తెదేపా, జనసేన, బిజెపి కూటమి ఘన విజయం సాధించి, అధికారం చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కేక్ కట్ చేసి కార్యకర్తలతో వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ మొదట కూటమి ప్రభుత్వం విజయవంతంగా సంవత్సర పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యకర్తలకు, నాయకులకు శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అవకతవకలు, లిక్కర్ మాఫియా, భూ దందాలు, అమాయక ప్రజల పై ఆకృత్యాలు జరిగాయన్నారు. వాటన్నిటికీ చరమగీతం పాడుతూ గత ఏడాది రాష్ట్ర ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించి నారా చంద్రబాబు నాయుడు ని నాలుగవసారి ముఖ్యమంత్రిని చేశారని అన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని నిలబడుతూ మొదటి సంవత్సరం విజయవంతంగా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టే విధంగా అనేక చర్యలను తీసుకున్నారని అన్నారు. వీటిలో భాగంగా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా చేయడానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అనేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. బహుళ జాతి కంపెనీలను రాష్ట్రానికి రప్పించి పెట్టు బడులు పెట్టే విధంగా చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకువచ్చారని అన్నారు. నేటి నుండి తల్లికి వందనం ద్వారా ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల తల్లుల ఖాతాలలో 15 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తున్నదని అన్నారు. అంతే కాకుండా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నారని ఇప్పటికే కొన్ని హామీలను అందించడం జరిగిందని వాటిలో పెన్షన్ను 4000 రూపాయలకు పెంచడం జరిగిందని, రైతులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం, మత్స్యకారులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం, రేషన్ డిపోలను తెచ్చి పూర్వపు పద్ధతిని తీసుకువచ్చారని అన్నారు. ఇలా రాష్ట్రంలో అనేక సంస్కరణను తీసుకువస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డపాటి చిన రాజారావు, బొడ్డేడ శంకర్రావు, వేగి దొర బాబు, శిలపరశెట్టి బాబి, సీదరాల సూర్యనారాయణ,వామల కాశి, యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, పొలిమేర నాయుడు,బోడి వెంకట్రావు,కరణ%శీ% శ్రీనివాసరావు, కుప్పిలి జగన్మోహన్రావు, దాడి ఈశ్వరరావు,కటారి దేవుడు, ఆళ్ళ ప్రవీణ్ కుమార్, పొలిమేర శివ అప్పారావు, యలపు శ్రీనివాస్, కాండ్రేగుల చందు, సింహాద్రిరావు, పోల్నీ సత్య రావు, జెర్రిపోతుల ధర్మారావు, అల్లం అప్పారావు,కరణం సోమునాయుడు, కోట్నీ సురేష్, పేజీ రాము, తాడి రాజేశ్వరరావు, శ్రీనురాజు, నందారపు కుమార్, నంబరు రమణ, చీరా శ్రీను, ఇంటి త్రినాథ్, లోవ అప్పారావు, రేబాక ఇంద్ర కుమార్, దాసరి బాబు, మద్దాల కృష్ణ, మల్ల వెంకట రామారావు, అంతే రమణ, కోయిలాడ నాగు, ఓమ్మి శ్రీను, కొణతాల రమణ బాబు, పిల్లా గోవింద్, పెంటకోట వేగులమ్మ నాయుడు, కొణతాల జగదీష్, వెలగా బుజ్జి,పోలమరశెట్టి సూరిబాబు, మళ్ళ కన్నం నాయుడు, రాపేటి తాతారావు, ఆడారి రవణ బాబు,కొత్త గోపాలకృష్ణ, కొణతాల బాబురావు, పలకా కాసులు, వద్దాది పాలరావు, రేబాక ఇంద్ర కుమార్, దాడి శ్రీను, గాజుల రాంబాబు, బుద్ధ శేఖర్,దాడి కేశవ, గోవింద్,బండి రాజబాబు,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 10 వేల మంది కార్మికులతో భారీ యోగా ప్రదర్శన

**- యోగా మన భారతదేశ ప్రాచీన సంస్కృతి హోం మంత్రి అనిత - ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగ భాగం కావాలి ఎంపీ సి ఎం రమేష్, - యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**



అచ్యుతాపురం, పెన్ సత్తా, జూన్ 12బీ యోగా మన ప్రాచీన సంస్కృతి, యోగాని ప్రపంచానికి బహుమతిగా ఇచ్చింది మన భారతదేశం, మనం ప్రతిరోజూ క్రమం తప్ప కుండా యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుండి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అచ్యుతాపురం ఏ పీ ఐ ఐ సీ ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్ ) వన్ స్టాప్ సెంటర్ వద్ద జిల్లా పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో థీమటిక్ యోగ ప్రదర్శన కార్యక్రమం గురువారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పది వేల మంది కార్మికులతో యోగా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు ఆర్. శ్రీను, బి.అప్పారావు, ఈ కార్యక్రమాన్ని నడిపిస్తూ యోగా లోని ఆసనాలు బ్రీతింగ్ టెక్నిక్స్ అన్నీ చేసి చూపించి హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి లోకసభ ఎంపీ సిఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, యలమంచిలి, వి మాడుగుల శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యన్నారాయణ మూర్తి, కార్మికులతో చేయించడం జరిగింది. ఈ సందర్బంగా రాష్ట హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలో ఈ నెల 21 న జరిగే 11 వ అంతర్జాతీయ యోగా ప్రదర్శన కార్యక్రమన్ని ఎంతో ప్రతిష్టత్మాకంగా చేపడుతున్నారు. అందులో భాగంగా మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం లో యోగాంధ్ర కార్యక్రమన్ని నిర్వహిస్తున్నామన్నారు. యోగా అనేది మన భారతీయ్య ప్రాచీన సంస్కృతి అని. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీఒక్కరూ యోగాభ్యాసన చేయాలని కోరారు. మానసిక, శారీరక ఆరోగ్య సాధనకు యోగా దివ్య ఔషదమని పేర్కొన్నారు. ప్రతీఒక్కరి దైనందిన జీవితంలో యోగా భాగం చేసుకోవాలని సూచించారు. ఎంపీ సి ఎం రమేష్ మాట్లాడుతూ ఈ నెల 21 న, 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం మన విశాఖపట్నం లో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి రోజు ఉదయం ఒక గంట యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుండి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఇప్పుడున్న బిజీ షెడ్యూల్ లో ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యం పై దృష్టి పెట్టడం లేదన్నారు. అందువల్ల చిన్న వయసులోనే మధుమేహం, దృష్టి లోపం వస్తున్నాయని, దీని వల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతోందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ యోగా చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని, అలసట ఉండబోదని ఉద్బోదించారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ప్రతి రోజు క్రమం తప్పకుండ యోగా చెయ్యడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారన్నారు. స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేసినట్లయితే కార్మికులందరూ ఆరోగ్యంగా జీవిస్తారని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారన్నారు. ఈ 21 వ తేదీన విశాఖపట్నంలో జరగబోయే 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవంకి అందరూ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. వి. మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యన్నారాయణ మూర్తి మాట్లాడుతూ వారంలో కనీసం రెండు రోజులైనా రోజుకి అరగంట యోగా చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారన్నారు. ఈ యోగా ప్రదర్శనలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఎ.పి.ఐ.ఐ.సి, డి. జి .ఎమ్. రాజశేఖర్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె. మనోరామ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇ.ఇ. ముకుందా రావు, పెద్ద ఎత్తున బ్రాండిక్స్ కంపెనీ మహిళా కార్మికులు, లారస్ ఫార్మా కర్మాగారం కార్మికులు, ఇతర కర్మగారా, పరిశ్రమల కార్మికులు, ఇతర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## సుపరిపాలనకు ఏడాది పూర్తి

విజయవాడ పెన్ సత్తా జూన్ 12: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ టిడిపి కార్యాలయంలో సుపరిపాలనకు ఏడాది కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, అనంత పురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యము యోగ కార్యక్రమం

అనకాపల్లి పెన్ సత్తా జూన్ 12: జిల్లా సిద్ధిలింగేశ్వర స్వామి వారి దేవస్థానం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యములో గురువారం ఆలయ మండపంలో బి.రోహిణి యోగ టీచర్ భోదనలో దేవస్థానం సిబ్బంది, ఆలయ కార్య నిర్వహణాధికారి, మాజీ చైర్మన్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు యోగాలో పాల్గొన్నారు. యోగ ఆంధ్రలో భాగంగా 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సంధర్భంలో నిర్వహించారు.



## దుర్గమాంబ అమ్మవారి దర్శించుకున్న పయిల

పరవాడ పెన్ సత్తా జూన్ 12: పయిల వారి కుటుంబం ఇలవేల్పు, పరవాడ గ్రామ ప్రజల ఆరాధ్య దేవత భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి దుర్గమాంబ అమ్మవారు పండగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన వైఎస్ఆర్సీపి రాష్ట్ర సి ఈ సి సభ్యులు పయిల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మాజీ ఆర్ ఈ సి ఎస్ చైర్మన్ చల్లా కనకారావు, ఆలయ ధర్మకర్త పయిల పెద్దింటి పోతునాయుడు, పయిల రాధాకృష్ణ, వర్రి హరి, లాలం సన్యాసి నాయుడు, మాజీ వార్డు సభ్యులు పయిల ముత్యాల నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అమ్మావారి చల్లని చూపులతో ఈ గ్రామానికి ప్రాంతానికి మంచి జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు.

## ఎస్ఎస్ ఫార్మా లో ప్రమాదం కార్మికుల మృతి



అనకాపల్లి పెన్ సత్తా జూన్ 12: జిల్లా పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ నందు సాయి శ్రేయాస్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో గ్యాస్ లీకై పరిశ్రమలో జరిగిన ప్రమాదం పై రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రసాయన వాయువులు పీల్చి ఇద్దరు కార్మికులు మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరొక కార్మికుడు ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. ప్రమాదానికి గల కారణాల పై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# గంజాయి అక్రమ వ్యాపారంతో సంపాదించిన ఆస్తులు సీజ్

## - విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం పెన్ సత్తా జూన్ 12: జిల్లా లోని ఎస్.కోట పోలీసు స్టేషను పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితుడిగా అరెస్టు కాబడిన గంజాయి వ్యాపారి ఒడిస్సా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా నందపూర్ మండలం, బసుపుట్ గ్రామం, సోబాపుట్ వార్డుకు చెందిన పతి ఖిల అలియాస్ గురు (32 సం.లు)కు చెందిన రూ.42,70,000/- ల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఒడిస్సా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా నందపూర్ మండలం, బసుపుట్ గ్రామం, సోబాపుట్ వార్డుకు చెందిన పతిఖిల అలియాస్ గురు (32 సం.లు) ఆదేశాలతో ఇద్దరు వ్యక్తులు 200 కిలోల గంజాయిని అక్టోబరు 6, 2024న తరలిస్తూ ఎస్.కోట పట్టణం పందిరప్పన్న జంక్షన్ వద్ద ఎస్.కోట పోలీసులకు పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణకు కారకులైన ప్రధాన నిందితుడిగా పతి ఖిల అలియాస్ గురును ఎస్.కోట పోలీసులు గుర్తించి, అతడిని అక్టోబరు 10, 2024న అరెస్టు చేసి, విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండు నిమిత్తం తరలించారన్నారు. విచారణలో నిందితుడు పతి ఖిల అలియాస్ గురు గత కొన్ని సంవత్సరాలుగా గంజాయి అక్రమ రవాణ చేస్తూ, వివిధ ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్నట్లు, వచ్చిన అక్రమ సంపాదనతో రూ.42,70,000/- ల విలువైన స్థిర, చరాస్థులను సంపాదించినట్లుగా గుర్తించామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇటీవల ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణను నియంత్రించుటలో భాగంగా గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించి, ఉత్తర్వులు జారీ చేయడంతో, చర్యలకు ఉపక్రమించామన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇచ్చిన ఆదేశాలతో ఎస్.కోట ఇన్స్పెక్టర్ వి.నారాయణ మూర్తి ఈ కేసులో మరింత లోతైన విచారణ చేపట్టి, నిందితుడు పతి ఖిల అలియాస్ గురు కోరాపుట్ జిల్లా సోబాపుట్లో రూ.40 లక్షల విలువైన 10 సెంట్ల స్థలంలో ఇంటిని నిర్మించినట్లుగా గుర్తించామన్నారు. అదే విధంగా రూ.1.50 లక్షల విలువైన ఎపి 31 టిజి 4002 నంబరు గల ఆటో, రూ.1.20 లక్షల విలువైన ఒడి 10వి 6297 నంబరు గల టివిఎస్ అపాచె మోటారు సైకిలును కొనుగోలు చేసినట్లుగా గుర్తించామన్నారు. అంతే కాకుండా, సునాబెడ లోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు ఖాతకు ఏప్రిల్ 21, 2023న రూ.38,28,816/ల నగదు జమయినట్లుగా గుర్తించామన్నారు. ఇవి కాకుండా గంజాయి వ్యాపారుల నుండి పతి ఖిల అలియాస్ గురు బ్యాంకు ఖాతాకు పలుమార్లు రూ.6.87 లక్షల నగదు జమ అయినట్లు, నగదు బదిలీ చేసిన వ్యక్తులు కూడా గంజాయి వ్యాపారాలు సాగిస్తూ, పోలీసులకు పట్టుబడిన వారేనని, వారి పై కూడా రాజస్థాన్, మహారాష్ట్ర, అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి అక్రమ రవాణ కేసులు ఉన్నట్లుగా గుర్తించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నిందితుడు పతి ఖిల అలియాస్ గురు (32 సం.లు) గంజాయి అక్రమ రవాణను లాభసాటి వ్యాపారంగా భావించి, గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్నట్లుగా గుర్తించినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి. సౌమ్యలత ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, పలు రికార్డులను, డాక్యుమెంట్లును తనిఖీ చేసి, నిందితుడు పతి ఖిల అలియాస్ గురు గత కొన్ని సంవత్సరాల్లో ఇంటిని నిర్మించి, ఆటో, మోటారు సైకిలును కొనుగోలు చేసినట్లు, సంపాదించిన అక్రమ ఆస్తుల విలువ రూ.42.70 లక్షలు ఉంటుందని, నిందితుడి అక్రమ ఆస్తులను ఎవరికీ విక్రయించ కుండా చట్ట పరిధిలో ఫ్రీజ్ చేసినట్లుగా నోటీసులు కూడా జారీ చేసామన్నారు. ఫ్రీజ్ చేసిన ఆస్తులు కోలకతా లోని కాంపిటెంట్ అథారిటీ పరిధిలోకి వెళ్ళిపోయినట్లు, సదరు ఆస్తులను ఎవరి కొనుగోలు చేసినా, చెల్లనేరమని, ప్రజలు గమనించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పని చేసిన అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, ఎస్.కోట ఇన్స్పెక్టర్ వి.నారాయణమూర్తి, ఇతర పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

# వేతనాల కోసం విమ్స్ వైద్యుల ధర్నా



ఆరిలోవ: విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులు ధర్నా చేపట్టారు. తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కాంట్రాక్ట్ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విమ్స్ ఆవరణలోని అవుట్ పేషెంట్ విభాగం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ హారిక తదితర వైద్యులు మాట్లాడారు. తాము రూ. 92,000 జీతంతో కాంట్రాక్ట్ పద్ధతిలో విమ్స్లో చేరి మూడేళ్లు పూర్తయిందని, కానీ ఇప్పటివరకు తమ వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం గతంలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు స్పందించలేదని వైద్యులు ఆరోపించారు. తమ వేతనాలను రూ.1.60 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. వైద్యులు ధర్నా చేసిన రెండు గంటల పాటు రోగులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడ్డారు.

# మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారమివ్వాలి

## - మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ అనకాపల్లి అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్



మహారాణిపేట: పరవాడలోని జేఎన్ ఫార్మాసిటీలో ఉన్న ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటనలో మృతి చెందిన పరిమి చంద్రశేఖర్(తెలంగాణా), శరగడం కుమార్(మునగపాక) కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ విశాఖ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎసెన్షియా ఫార్మా తదితర కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో చాలా మంది మరణించారని పేర్కొన్నారు. కంపెనీల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఏడాది కాలంలో ఇన్ని ప్రమాదాలు ఎప్పుడూ జరగలేదన్నారు. గతంలో జరిగిన ప్రమాదంలో ఎలా నష్ట పరిహారం ఇచ్చారో అలాగే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కూలిన ఉక్కు దీక్ష శిబిరం షెడ్



కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల దీక్ష శిబిరం షెడ్ కూలిపోయింది. కురిసిన వర్షానికి తాటాకులతో నిర్మించిన షెడ్డు నేలమట్టమైంది. దీంతో కార్మికులు తమ నిరసనను శిబిరం వెలుపల కొనసాగించాల్సి వచ్చింది. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం 2021 ఫిబ్రవరి 12న అఖిలపక్ష కార్మిక సంఘాలు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించాయి. ఈ దీక్షల కోసం తాటాకులతో ఈ షెడ్డును నిర్మించారు. సుమారు ఐదేళ్లు కావస్తున్నందున ఎండకు ఎండి, వానకు తడిసి షెడ్డు ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితికి చేరుకుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి షెడ్డు కూలిపోయింది. అయితే ఆందోళనకారులు, కార్మిక సంఘాలు మళ్లీ షెడ్డు నిర్మిస్తాయా లేదా అనేది చూడాలి. ఎందుకంటే ఇటీవల పోలీసులు శిబిరాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అక్కడే కూర్చున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు తిరిగి షెడ్డు నిర్మాణానికి అనుమతిస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

# సీఎన్సీ ప్లాస్మా కటింగ్ మెషీన్ ప్రారంభం




సింధియా: విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ కోసం నిర్మిస్తున్న 60టీ బోలార్డ్ పుల్ టగ్ స్టీల్ కటింగ్ వేడుక ఘనంగా జరిగింది. హిందూస్థాన్ షిప్యార్డ్ హల్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన సీఎన్సీ ప్లాస్మా కటింగ్ మెషీన్ను పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ అంగముత్తు ప్రారంభించారు. ముందుగా చైర్మన్ అంగముత్తును హిందూస్థాన్ షిప్యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి ఘన స్వాగతం పలికారు. రెండు సంస్థల మధ్య బలమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకలో విశాఖపట్నం పోర్ట్, షిప్యార్డ్ కార్మికులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షిప్యార్డ్ సీఎండీ మాట్లాడుతూ సముద్ర రంగం అభివృద్ధిలో విశాఖ పోర్ట్, షిప్యార్డ్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో భవిష్యత్తులో ఎలక్ట్రిక్, హైడ్రోజన్ శక్తితో నడిచే గ్రీన్ టగ్స్ అభివృద్ధికి హెచ్ఎస్ఎల్ కృషి చేస్తోందని తెలిపారు. పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ హిందూస్థాన్ షిప్యార్డ్ సంస్థ నౌకా నిర్మాణ రంగంలో సృష్టిస్తున్న అద్భుతాలు, నూతన పని విధానాలను అభినందించారు. పోర్ట్ ట్రస్ట్ కోసం నిర్మిస్తున్న టగ్ నిర్మాణ పద్ధతులను వివరించారు.

# చిన్నారులకు ఆటపాటలతో బోధన అవసరం




అనకాపల్లి: అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో బోధన అవసరమని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. స్థానిక వేల్పులవీధి అంగన్వాడీ కేంద్రంలో మన అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 52 మంది చిన్నారులకు సాముహిక అక్షరాభాస్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు ఆస్తిపాస్తులే కాకుండా మంచి విద్యను అందించడానికి కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య ఆరంభ దశలో పిల్లలను తీర్చి దిద్దడంలో అంగన్వాడీ కార్యకర్త పాత్ర ఎంతో కీలకమైందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎన్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ ప్రీస్కూల్ కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ వరకూ జిల్లాలో అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రాథమిక విద్యను పూర్తి చేసిన 5 సంతవ్సరాల చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.ప్రభావతి, ప్రాజెక్టు సూపర్వైజర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వినతి



తుమ్మపాల: తొలగించిన స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్లోని డీఆర్వో వై.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించి కార్మికుల సమస్యలను వివరించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ చర్చల్లో ఎట్టి పరిస్థితిలోని కాంట్రాక్ట్ కార్మికులను తొలగించమని చెప్పి నిబంధనలకు విరుద్ధంగా తొలగించడం బాధాకరమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సమ్మె చేస్తే యాజమాన్యం వేధిస్తుందని ఆరోపించారు. కార్మికులను తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.త్రినాథ్, కోరిబిల్లి శంకరరావు, సిహెచ్.రమణ, ఫణీంద్ర, సత్యనారాయణ పాల్గొన్నారు.

# బాల కార్మికులు లేని సమాజమే లక్ష్యం




విశాఖ: బాల కార్మికులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత ప్రిన్సిపల్ జడ్జి, లోక్ అదాలత్ న్యాయమూర్తి జి.వల్లభ నాయుడు అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కార్మిక శాఖ, జిల్లా విద్యాశాఖ, యాక్సిస్టివ్ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ అఫ్ హెూల్డ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు బాల కార్మికులుగా మారడానికి తల్లిదండ్రులు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. నిరక్షరాస్యత, వలస వెళ్లడం, ఇంటి పనులకు పెట్టడం, ఆర్థిక పరిస్థితుల వల్ల బాలలు బాల కార్మికులుగా మారుతున్నారని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ లేబర్ సునీత మాట్లాడుతూ బాల కార్మికులను రెస్క్యూ చేయడంలో తమ సమస్త డిస్టిక్ టాస్క్ ఫోర్స్ సభ్యులు విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. తిరిగి రిహాబ్లేట్ చేయడం కోసం బాలల సంక్షేమ సమితి, ఇతర డిపార్టుమెంటు, స్వచ్ఛంద సేవా సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయన్నారు. మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.పుష్యరాగం మాట్లాడుతూ చదువుకోవలసిన బాలలు పనిలోకి వెళ్లడం విచారకరమన్నారు. యాక్సిస్ టు జస్టిస్ అఫ్ హెూల్డ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జి.డేవిడ్ రాజు మాట్లాడుతూ తమ సంస్థ గత సంవత్సరం లేబర్ డిపార్టుమెంటు, మిగిలిన సంస్థలతో కలిసి 2012 మందిని రిస్క్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రభుత్వ అధికారిణి మమత పాల్గొన్నారు.

# రైల్వే ఆస్పత్రిలో ఆధునిక పరికరాల ప్రారంభం



తాటిచెట్లపాలెం: ఈస్ట్కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం అధునాతన పరికరాలను డీఆర్ఎం లలిత్ బోరా ప్రారంభించారు. ఫిజియోథెరపీ యూనిట్లో ఇథైలిన్ ఆక్సైడ్ స్టెరిలైజర్, అడ్వాన్స్డ్ లేజర్ మెషీన్లను ఆయనతోపాటు, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన పరికరాల సాయంతో రైల్వే ఉద్యోగులకు మరింత సుఖవంతమైన, శ్రేయస్కరమైన వైద్యసదుపాయాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్బాబు, ఏడీఆర్ఎం(ఇన్ఫ్రా) ఇ.శాంతారాం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏడాది పాలన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

**- గడిచిన ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకానికి వైసీపీ దొంగ బిల్లులు - కేంద్ర ఆడిట్ లో అడ్డంగా దొరికిన వైసిపి నాయకులు - వైసీపీ దండుకున్న రూ. 250 కోట్లను ఇప్పుడు కూటమి చెల్లించాల్సి వస్తుంది - కంపెనీల నుంచి 2% కమిషన్ అడిగిన వైసీపీ అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి**



గుంటూరు పెన్ సత్తా జూన్ 12: దొంగ బిల్లులు పెట్టి, కేంద్ర ప్రభుత్వాన్ని మభ్య పెట్టి రూ. 250 కోట్లను వైసిపి ప్రభుత్వం వసూలు చేసుకుంది. కొత్త నిధులు కావాలంటే, వైసీపీ వసూలు చేసుకున్న నిధులను వెనక్కి ఇవ్వమని కేంద్ర ప్రభుత్వం అడుగుతుంది అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది కాలం ముగిసిన సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మొహమ్మద్ నజీర్ అహ్మద్ కార్యాలయంలో జరిగిన విజయోత్సవ కార్యక్రమానికి గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటం ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది, గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడా ప్రజలు గమనించాలి. జగన్ పాలనలో అభివృద్ధి నిర్వీర్యం అయిందే తప్ప ఎక్కడ ప్రజాసంక్షేమం జరగలేదన్నారు. జగన్ సంక్షేమం పేరుతో పొద్దునే డబ్బులు ఇచ్చి సాయంత్రానికి వసూలు చేసుకునే కార్యక్రమం తప్ప ఏమి అభివృద్ధి జరగలేదు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇన్స్టాల్ మెంట్ కింద తీసుకోవడం అవసరమైన వాళ్ళకి మళ్ళించడం. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం అని ఒకటి ఉంది, ఈ పథకం ద్వారా ముస్లిం మైనారిటీ సోదరులకు కావలసిన సౌకర్యాలను, నిర్మాణాలను చేపట్టవచ్చు అన్నారు. నేను కేంద్ర మంత్రి అయిన తర్వాత నా పార్లమెంట్లోని ముస్లిం మైనార్టీలకు ఏమైనా చేయవచ్చా అని ఎంక్వయిరీ చేసినప్పుడు ఈ పథకం గురించి తెలుసుకున్నాను అని, అప్పుడే వైసిపి చేసిన అరాచకం కూడా తెలిసిందన్నారు. 2014 - 19 సమయంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా 500 పనులను చేస్తామని టిడిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అందులో 55 పనులను కూడా పూర్తి చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అదనంగా మరో 80 పనులను పూర్తి చేశామని కేంద్రానికి బిల్లులు సమర్పించి, బిల్లులు కూడా వసూలు చేసుకున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆడిట్ నిర్వహించగా, వైసిపి ప్రభుత్వం అసలు ఆ 80 పనులను చేయలేదని, నకిలీ బిల్లులను సమర్పించి బిల్లులు వసూలు చేస్తుందని తేల్చారు. ఇది వాస్తవం కాదు, అబద్ధం అని నిరూపించే ధైర్యం ఉంటే వైసిపి నుంచి ఏ నాయకు ఎవరు అయినా రావచ్చు నేను డిబేట్ చేసి అసలు వాస్తవాలు ప్రజలకు తెలియజేస్తాను అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఆ పథకాన్ని ఉపయోగించు కోవాలని అంటే వైసిపి దొంగ బిల్లులు చూపించి వసూలు చేసుకున్న సుమారు రూ. 250 కోట్లను తిరిగి కేంద్ర ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. మైనార్టీ సోదరులు జగన్ చేసిన ఈ మోసాన్ని గమనించండి. నాలుగు శాతం రిజర్వేషన్లు అని చెప్పిన రాజశేఖర్ రెడ్డి కూడా హామీ ఇప్పటివరకు అమలు కాలేదు. హామీ ఇచ్చిన ఆయనకు కూడా ఆ రిజర్వేషన్ సుప్రీం కోర్టు పరిధి దాటి చేయలేమని తెలుసు. మరి ఇప్పుడు జగన్ రెడ్డి వచ్చి ముస్లిం మైనారిటీ సోదరులకు ఏం చేయగలిగారు. ముస్లింలకు దక్కాల్సిన నిధులను కూడా పక్కదారి పట్టించారు. గడిచిన ఐదేళ్లలో బటన్ నొక్కుడు కార్యక్రమం కాకుండా ముస్లింలకు ఏం చేశారు అని ప్రశ్నించారు. ఒక స్కూల్ కట్టించారా, ఒక రోడ్డు వేయించారా, ముస్లిములకు కనీసం ఏదైనా సంక్షేమం అందించారా?, ఒక కమ్యూనిటీ హాల్ గాని, డ్రైనేజ్ గాని ఏర్పాటు చేశారా, ఇది ప్రతి ఒక్క ముస్లిం సోదరులు ఆలోచించాల్సిన అంశం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రోజు తల్లికి వందనం పేరిట సంక్షేమ పథకం ప్రవేశపెట్టారు అన్నారు. గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్లో పది ఏళ్ళ నుంచి ఆగిపోయిన భవనాలను అందుబాటు లోకి తీసుకొస్తున్నాం. దక్కన్ టొబాకో వారితో మాట్లాడి ఎమ్మెల్యే నసీర్ ఆర్థో ట్రామా వంటి ఎన్నో సౌకర్యాలు జీజీహెచ్ లో అందుబాటు లోకి తీసుకొస్తున్నారు. గుంటూరులో రూ. 30 కోట్లతో పాటు కడప, కాకినాడలో కలిపి రూ. 100 కోట్లతో మూడు రేడియో థెరపీ ఎక్విప్మెంట్ తీసుకువస్తున్నాం. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్ తన సొంత జిల్లాలో రేడియో థెరపి మిషన్ పెట్టకుండా, అక్కడ పేద ప్రజలకు ఉపయోగ లేకుండా పాలన చేశారు. ఇదే కంపెనీ గతంలో ఈ యంత్రాలను ఏర్పాటు చేయాలని వస్తే అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి 2% కమిషనర్ అడిగారట, కాదని ఆ మంత్రి ప్రమాణం చేసి చెప్పమనండి. నేను చెప్పేది 100% వాస్తవమని అందరి దేవుళ్ల పై ప్రమాణం చేసి నిజం చెప్తాను అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనను, అభివృద్ధిని గురించి ముస్లిం మహిళలు, మైనారిటీ సోదరులు ప్రతి ఇంటికి వెళ్లి వివరించి చెప్పాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలి




విశాఖపట్నం పెన్ సత్తా జూన్ 12: పట్టణం లోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటియుసి జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు స్టీల్ ప్లాంట్లో అక్రమంగా చట్ట విరుద్ధంగా తొలగించిన 4,500 మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాని ఉద్దేశించి ఏఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలియజేశారు. అశేష త్యాగాలతో నిర్మితమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రభుత్వంగా పరిశ్రమగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని కార్పొరేట్లకు కట్ట బెట్టాలని చూస్తున్నారని అన్నారు. 40 ఏళ్లుగా విశాఖ స్టీల్ ప్లాంట్ కి సొంత గనులు కేటాయించ కుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నేడు నష్టాలు చవిచూస్తుందని తెలియజేశారు. ముడి సరుకు టన్ను 600 రూపాయలకి రావలసింది 6,000 కి నేడు కొనవలస వస్తుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్ ని రక్షించే విధంగా చర్యలు చేపట్టాలని తెలియజేశారు. రాష్ట్ర ప్రయోజనాలు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలని స్టీల్ ప్లాంట్ కున్న భూములు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం. మన్మధరావు, ఉపాధ్యక్షులు ఎస్కే. రెహమాన్, కే .సత్యనారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్రావు, కార్యదర్శులు పి. చంద్రశేఖర్, పడాల గోవిందు, నాగభూషణం, సిహెచ్ కాసు బాబు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం జయప్రదం చేయండి

**- 18 ఏళ్ల లోపు పిల్లలంతా చదువు కోవాలి పీలా శ్రీనివాసరావు మేయర్**




విశాఖపట్నం పెన్ సత్తా జూన్ 12: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం జయప్రదం చేయండి అని విశాఖపట్నం మేయర్ పీలా శ్రీనివాసరావు కోరారు. గురువారం ఉదయం జీవీఎంసీ లోని తన చాంబర్లో స్వాంతన స్వచ్ఛంద సేవా సంస్థ తీసుకు వచ్చిన బాల కార్మిక వ్యతిరేక పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ18 ఏళ్ల లోపు పిల్లలంతా చదువు కోవాలి అని కోరారు. ప్రతి ఏటా జూన్ 12 న నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన తీసుకు రావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల కార్మికుల పరిధి, దానిని నిర్మూలించడానికి అవసరమైన చర్యలు, ప్రయత్నాల పై దృష్టిని కేంద్రీకరించడానికి అంతర్జాతీయ కార్మిక సంస్థ 2002 లో ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని ప్రారంభించింది అని వివరించారు. ఈ కార్యక్రమంలో స్వాంతన సంస్థ డైరెక్టర్ ఎల్ ప్రజ్ఞాన్ కుమార్, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# షాదీ ఖానా కమ్యూనిటీ హాల్ కి శంకుస్థాపన చేసిన పెమ్మసాని



ప్రత్తిపాడు పెన్ సత్తా జూన్ 12: పట్టణం లోని ముస్లింల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన షాదీ ఖానా కమ్యూనిటీ హాల్ ని స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు తో కలిసి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమం లో అయన మాట్లాడుతూ ఈ రోజు ఈ కార్యక్రమం జరగడానికి కారణం రెండు కుటుంబాలు కారణం అన్నారు. రూ. కోటి విలువైన స్థలాన్ని దానం చేసిన నూతలపాటి పరమేశ్వర రావు, ప్రమీల ఒక కుటుంబం. రెండో కుటుంబం సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి. వీరు ఈ ప్రాంతానికి చెందినవారు కాకపోయినా కేవలం నాతో ఉన్న సత్సంబంధాలతో నాలుగు కోట్ల నిధులతో 9 కమ్యూనిటీ హాల్స్ ను మన గుంటూరు పార్లమెంటుకు అందజేశారన్నారు. నేటి పరిస్థితుల్లో భూమి ధరలు ఎప్పటి కప్పుడు కోట్లకు పరుగులు తీస్తుంటే కేవలం ప్రజల సౌకర్యం కోసమని ఈ కుటుంబాలు తమ స్థలాన్ని దానం చేయడం నిజంగా గర్వించదగ్గ విషయం. అందులో భాగంగానే ఇప్పుడు ప్రత్తిపాడు లో ముస్లింల కోసం షాదీ ఖానా కమ్యూనిటీ హాల్ లో నిర్మించబోతున్నాం అన్నారు. ఈ కమ్యూనిటీ హాల్స్ కూడా బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నాం. రూ 45 లక్షలతో నిర్మించబోయే ఈ కమ్యూనిటీ హాల్ లో, 2 వేల చదరపు అడుగుల్లో హాలు నిర్మాణం, టాయిలెట్స్, గెస్ట్ లకు ప్రత్యేక ఏర్పాట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సిటీలో ఉండే విధంగా అందుబాటు లోకి తీసుకొస్తున్నాం. కొందరు ముస్లింలు జగన్ కు మద్దతుగా ఉన్నారు. అయితే గత ఐదేళ్లలో ముస్లింలకు జగన్ ఏం చేశారో ఒకసారి గుర్తు చేసుకోండిని సూచన చేశారు. కమ్యూనిటీ హాల్స్ గాని, నిధులుగాని, సౌకర్యాలు గాని ఏమైనా కల్పించారా? అనేది గుర్తు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే మ్యాచింగ్ ఫండ్ అందించలేక, చేతులు దాకా వచ్చిన కేంద్ర నిధులను రాష్ట్రానికి అందకుండా జగన్ చేశారు. ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ముస్లింలకు ఏది కావాలంటే ఆ సౌకర్యాలు కల్పించుకునే అవకాశం ఉంటుంది. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 30 కోట్లతో రేడియో థెరపీ ఎక్విప్మెంట్ తీసుకురాబోతున్నాం. 100 కోట్లతో ఆయుర్వేద హాస్పిటల్ ను ఏర్పాటు చేయబోతున్నాం. గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ త్వరలో ప్రారంభించ బోతున్నాము. 2019 లో ఏ రేట్లకైతే కాంట్రాక్టర్లు పనులు చేస్తామన్నారు అదే ధరలకు ఇప్పుడు కూడా పనులు చేయిస్తాం తప్ప ఒక రూపాయి పెంచకుండా చూసుకునే బాధ్యత మేము తీసుకుంటాం అన్నారు. అందుకే ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను, ఆ ప్రభుత్వానికి, ఇప్పటి పరిపాలనకు తేడా గమనించాలని ప్రతి ఒక్కరిని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యను వ్యాపారం చేస్తున్న చైతన్య విద్యా సంస్థలు

**- పుస్తకాల పేరుతో వేల రూపాయల వ్యాపారమా? - ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్**




గుంతకల్లు పెన్ సత్తా: గుంతకల్లు నియోజకవర్గం వ్యాప్తంగా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణం లోని ఉన్న శ్రీ చైతన్య సి బ్రాంచ్ విద్యాసంస్థలు ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి అఖిల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యా సంవత్సరం గురువారం ప్రారంభించిన మొదటి రోజుకే శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం విద్యాసంస్థల్లో అడ్మిషన్స్ పూర్తిగా అయిపోయినాయి అడ్మిషన్స్ క్లోజ్ అయ్యాయి అని చెబుతున్నారు. అదే విధంగా పుస్తకాల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని మండి పడ్డారు, ఒకటవ తరగతికి 9,000 నుంచి 15 వేల రూపాయల వరకు పుస్తకాలు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని ఉన్నప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఒక రూములలో డంపు చేసుకొని వేల రూపాయలకు పుస్తకాలు అమ్ముతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్రూపులు పెట్ట కుండా టెక్నో సి బ్యాచ్, ఐకాన్ ఐపిఎల్, ఎంపీఎల్ ఒలంపియాడ్, ఈ టెక్నో రకరకాల గ్రూపుల పేర్లు ఏర్పాటు చేసుకొని ఒక గ్రూపుకి ఒక ఫీజు నిర్ణయించి వేలాది నుంచి లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గం వ్యాప్తంగా అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీ చైతన్య, కార్పొరేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఫీజు నియంత్ర కమిటీని ఏర్పాటు చేసి, ప్రభుత్వ నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకటవ తరగతి నుంచి, పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 30 వేల రూపాయల నుంచి, 50 వేల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పుస్తకాల వ్యాపారం అనుమతులు లేని విద్యా సంస్థల పై విద్యాశాఖ అధికారులు తక్షణమే ప్రత్యేకమైనటువంటి కమిటీని వేసి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల చేస్తున్న విద్యా దోపిడి ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి అఖిల్ కుమార్, పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్ ఖదీర్ ముస్తఫా, హర్షద్ అబ్రార్, భాస్కర్, ఫరూక్, మోహన్, నిరంజన్, సాయి, తేజ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా వేడుకలు



అచ్యుతాపురం పెన్ సత్తా జూన్ 12: ఎన్డిఏ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటి, మానవుల వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు లో భాగం గా తల్లి కి వందనం పథకం ప్రారంబించారు. ఈ శుభ సందర్భంగా యలమంచిలి నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి, ఏపీఆర్ డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదేశానుసారం మండలం దుప్పుతూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్ది తాతాజీ, మాజీ పి ఏ సి స్ చైర్మన్ దేశంశెట్టి ఎల్లయ్య నాయుడు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు ప్రగడ చిన నాగేశ్వరరావు అధర్వంలో దుప్పుతూరు ఉపాధి హామీ కార్మికుల సమక్షంలో కేక్ ను కట్ చేసి, ఉపాధి కార్మికులందరికీ అల్పాహారాన్ని ఇవ్వడం జరిగింది. తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ప్రగడ రాజు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐ టి మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో ముందుకు వెళుతుందని అన్నారు. ఎలక్షన్ లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఈ రోజు తల్లికి వందనం పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న తల్లులందరకు ఆనందాన్ని ఇస్తుందన్నారు. ముమ్మందు కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని పేదరికాన్ని నిర్మూలన చేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో కూటమి తీసుకు వెళ్తుందని అన్నారు. అదే విధంగా ఈగల్ టీం ఆధర్వంలో డ్రగ్స్ వద్దు, స్కిల్స్ ముద్దు అనే నినాదంతో ప్రజలందరకు డ్రగ్స్ ద్వారా యువత ఎలా చెడిపోతున్నారు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డ్రగ్స్ సరఫరాను నియంత్రించి, యువతను మంచి మార్గంలో నడిపించడం జరుగుతుంది. ఈ యొక్క కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రగడ కొండలరావు, ప్రగడ చిన కొండలరావు (బుజ్జి ), సత్తిబాబు, దేశంశెట్టి కాసుబాబు(మాజీ స్కూల్ కమిటీ చైర్మన్), శెట్టి గణేష్(ఏ పి బి వి పి సభ్యులు), శెట్టి సత్తిబాబు (జనసేన గ్రామ శాఖ ఉపాధ్యక్షులు)బి. ఈశ్వరరావు, ప్రగడ దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోదీ పాలన స్వర్ణయుగం

## - బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు



పాడేరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11ఏళ్ల పాలన స్వర్ణయుగమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు అన్నారు. 11ఏళ్ల సేవా సుపరిపాలన, వికసిత్ భారత్ 2047 కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా గిరిజన మహిళలకు స్వయం ఉపాధి పథకాలు అందుబాటులోకి వచ్చాయని, తద్వారా ఎంతో ఆర్థిక లబ్ధి చేకూరుతోందన్నారు. పీవీటీజీలకు పీఎం జన్‌మన్ పథకం వరమని, పెద్ద ఎత్తున పక్కాగృహాల నిర్మాణం జరుగుతుందన్నారు. జల్‌జీవన్‌మిషన్‌తో తాగునీటి పథకాలు నిర్మితమవుతున్నాయన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు డైరెక్టర్ కురుసా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. అరకు కాఫీకి ఆర్గానిక్ బ్రాండ్‌గా ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మతం శాంతకుమారి, జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య, ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రతినిధి పెనుమాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మా కంపెనీ బస్సుకు మంటలు

## - ఇంజిన్ ఆయిల్ లీకేజీయే కారణం



అనకాపల్లి: పరవాడ లారస్ కంపెనీకి చెందిన బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. చోడవరంలో నివాసముంటున్న కంపెనీ ఉద్యోగులను తీసుకురావడానికి లంకెలపాలెం నుంచి ఉదయం 11 గంటల సమయంలో బస్సు బయలుదేరింది. తుమ్మపాల దర్జీనగర్‌కు చేరుకొనే సమయంలో వెనక నుంచి వచ్చిన ద్విచక్రవాహనదారులు బస్సు వెనక మంటలు వస్తున్నాయని చెప్పడంతో డ్రైవర్ బస్సును నిలిపివేశారు. ఈ సమయంలో బస్సులో మరెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది. వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం తెలపడంతో హుటాహుటిన సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదం ఇంజిన్‌లో ఆయిల్ లీకేజీ వలన జరిగిందని రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

# ఐఐఏఎం బిజినెస్ స్కూల్‌లో విదేశీ విద్య




విశాఖపట్నం: ఐఐఏఎం(ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్) బిజినెస్ స్కూల్ విదేశీ విద్యను అందించేందుకు ఇండో గల్ఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఐజీఎంఏ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఎంవీపీకాలనీలోని ఐఐఏఎం బీ–స్కూల్‌లో ఇరు సంస్థల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఐఐఏఎం కార్యదర్శి, డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో యువతకు నాణ్యమైన విద్యను అందించి.. అంతర్జాతీయ ఉద్యోగ, వ్యాపార అవకాశాలను అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. ఐఐఏఎం బీ–స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఏఐ టెక్నాలజీలకు సంబంధించిన కోర్సులు ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థులు ఏడాది పాటు దుబాయ్‌లో విద్యనభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఈ కోర్సులకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆమోదం ఉందన్నారు. ఐజీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ అవకాశాలను యువతకు చేరువ చేసేందుకు ఈ ఎంవోయూ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. విశాఖతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిజిటల్ యుగంలో సర్వీస్ మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ విద్య విశిష్టత, కార్పొరేట్ అవసరాలు, ఏఐ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన్ని ఐఐఏఎం బీస్కూల్ ప్రతినిధులు సత్కరించారు.

# కేంద్రం పథకాలతో సమగ్ర గిరిజనాభివృద్ధి సాధ్యం



పాడేరు: సమగ్ర గిరిజనాభివృద్ధి లక్ష్యంగా ప్రధానమంత్రి దర్తీ ఆబా జంజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (పీఎం జుగా)దోహదపడుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం జుగా, పీఎం జన్‌మన్ పథకాలపై ఈనెల 15 నుంచి 30 వరకు జిల్లాలోని 518 గ్రామ సభల ద్వారా గిరిజనులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న పథకాలతో గిరిజన సాధికారతకు కృషి చేస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వ పథకాలు అమలుజేస్తామన్నారు. ప్రభుత్వ పథకాల అమలుతీరు పర్యవేక్షణకు తన అధ్యక్షతన ఐటీడీఏ పీవోలు, పలుశాఖల అధికారులతో జిల్లా కమిటీలు, ఎంపీడీవోల అధ్యక్షతన మండల స్థాయిలో పలువురు అధికారులతో మండల కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. పాఠశాలలకు దూరంగా ఉన్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతితో కూడిన భోజన సదుపాయం కల్పనకు 22 వసతి గృహాల నిర్మాణానికి జిల్లాకు ఎస్ఎస్ఏ నిధులు రూ.6,896 లక్షలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. పాడేరు, రంపచోడవరం డివిజన్లలో రెండు మల్టీపర్పస్ మార్కెటింగ్ కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఒకొక్కదానికి రూ.కోటి వెచ్చిస్తున్నట్టు చెప్పారు. రంపచోడవరం డివిజన్‌లో కేంద్రాన్ని ఆకుమామిడికోటలో నిర్మిస్తామన్నారు. పాడేరు డివిజన్‌లో 1,12,873 మందికి, రంపచోడవరం డివిజన్‌లో 25,14 6మందికి అటవీ హక్కుల చట్టం కింద భూములు పంపిణీ చేశామని చెప్పారు. పాడేరు డివిజన్‌లో రెండు వేల మందికి, రంపచోడవరం పరిధిలో 1496 మందికి కొత్తగా పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్ పాల్గొన్నారు.

# బాల్య వివాహాలతో జీవితాలు ఛిన్నాభిన్నం


బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి హిమబిందు, సూపర్‌వైజర్ శివజ్యోతి పాల్గొన్నారు.

రేపల్లె: బాల్య వివాహాలతో బాలల జీవితాలు ఛిన్నాభిన్నమవుతాయని, బాలికలపై లింగవివక్షతను వీడాలని సీడీపీఓ సుచిత్ర పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 24వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం సమ్మర్ ప్రత్యేక క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. లింగవివక్ష చూపేవారు చట్టరీత్యా శిక్షర్హులన్నారు. బాల్య వివాహాల కట్టడికి ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో సైబర్‌నేరాలు అధికంగా ఉన్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోరాదని సూచించారు. కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా తల్లిదండ్రులకుగాని, ఉపాధ్యాయులకుగాని తెలియజేయాలని సూచించారు. అనంతరం

# ఏయూలో కొలువుదీరిన కొత్త నాయకత్వం



మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం విభాగాలకు నూతన నాయకత్వం పదవీ బాధ్యతలు చేపట్టింది. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు చేతుల మీదుగా డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లకు నియామక ఉత్తర్వులను అందించారు. మొత్తం 43 మందికి వివిధ పదవీ బాధ్యతలను కేటాయించారు. అనంతరం వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించామని, త్వరలో నూతన కార్యక్రమాలను చేపట్టేలా ప్రతి విభాగం పనిచేయాలన్నారు. విద్యార్థులతో, సిబ్బందితో గౌరవప్రదంగా నడుచుకోవాలన్నారు.

యువతకు ప్రాధాన్యత... నూతనంగా నియామకం చేసిన డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లలో అత్యధికంగా యువతకు అవకాశం కల్పించారు. ప్రతి విభాగంలో ఉన్న యువ ఆచార్యులను ఎంపిక చేసి ఈ బాధ్యతలు కేటాయించారు. భవిష్యత్ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ వర్సిటీని ముందుకు నడిపించే దిశగా యువ ఆచార్యులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

# అంతర్ రాష్ట్ర మహిళల బ్లైండ్ క్రికెట్ విజేత ఒడిశా

## - రన్నరప్‌గా ఆంధ్రప్రదేశ్ జట్టు




విశాఖపట్నం: ఉక్కు స్టేడియంలో జరిగిన అంతర్ రాష్ట్ర మహిళల బ్లైండ్ క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్ (సీఏబీఏపీ), క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ కేరళ (సీఏబీకే) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్‌లో ఢిల్లీ, ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొన్నాయి. జరిగిన ఫైనల్స్‌లో ఒడిశా జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగింది. 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు 15 ఓవర్లలో 80 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఒడిశా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌కు డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. ముగింపు కార్యక్రమంలో ఎన్టీపీసీ ఈడీ సమీశ్ శర్మ, హెచ్‌ఆర్ బి.బి.శర్మ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్‌కుమార్ రెడ్డి, కో–ఆర్డినేటర్లు అమ్మి నాయుడు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.53.29 లక్షలు



విశాఖపట్నం: కనకమహాలక్ష్మి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. మార్చి 27 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రూ.53,29,489 నగదు, 59 గ్రాముల బంగారం, 990 గ్రాముల వెండి లభించింది. అలాగే యూఎస్‌ఏకి చెందిన 32 డాలర్లు, కువైట్‌కు చెందిన 1/4 దినర్, 5 రూపీస్ నేపాల్ కరెన్సీ, శ్రీలంకకు చెందిన 100 రుపీస్, ఇంగ్లండ్‌కు చెందిన 5 యూరోస్, హాంగ్‌కాంగ్ కరెన్సీ 20 డాలర్లు, సింగపూర్ కరెన్సీ 10 డాలర్లు, అరబ్ ఎమిరేట్స్ 5 దిరమ్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో కె.శోభారాణి, వెలంపేట దుర్గాలమ్మ ఆలయ ఈవో పి.శేఖర్‌బాబు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, గోపాలపట్నం శ్రీ హరి సేవ సభ్యులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నోటీస్



విశాఖపట్నం: విజయనగరం జోన్ వ్యాప్తంగా ఉన్న సమస్యల పరిష్కారంలో యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా.. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు సమ్మెకు సంబంధించిన నోటీసు అందజేసినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.వి.మోహన్ తెలిపారు. ఈ నెల 8న జరిగిన జోనల్ కౌన్సిల్ సమావేశంలో యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని.. జోన్‌లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు సమ్మె నోటీసులు ఇవ్వాలని తీర్మానం చేశారన్నారు. ఈ నెల 26వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్లే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు సమ్మె నోటీస్ మెమోరాండంను సమర్పించామన్నారు. రాష్ట్ర కార్యదర్శి జి.ఆర్.రావు, జిల్లా కార్యదర్శి పిల్లా శంకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు పి.ఎన్.మూర్తి, విజయనగరం మాజీ జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తితో పాటు జోనల్‌లోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపు



మాడుగుల: మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. రహదారి కిరువైపులా గల ఆక్రమణలు తొలగించి, డ్రైనేజీలను నిర్మించాలని కోరుతూ విశ్రాంత ఉపాధ్యాయుడు, స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, స్థానికులు తాకాశి శ్రీను తదితరులు ఈ ఏడాది మార్చి 10 న అనకాపల్లి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మార్చి 19న ఆర్‌అండ్‌బీ, స్థానిక పంచాయతీ అధికారులు సర్వే చేసి ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ చేశారు. తర్వాత పొక్లెయిన్తో ఆక్రమణల తొలగించే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ మాడుగుల ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వారి సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొర, సిబ్బంది, ఎస్ఐ నారాయణరావు, హెడ్ కానిస్టేబుల్ పెద్దయ్య, తదితర పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో రోడ్డు మధ్య భాగం నుంచి 11 మీటర్లు అటు, ఇటు వైపునా ఆక్రమణలు తొలగించారు. జంక్షన్‌లో నిర్మించిన 33 మీటర్ల వరకు ఉన్న ఈ ఆక్రమణలను తొలగించారు. దీనిలో భాగంగా సంతోషిమాత ఆలయం అన్నదాన సత్రం ముందు భాగంలో గల అరుగును, బాత్రూమ్, వంటశాల, సంతోషిమాత ముందు భాగంలో తొలగించారు. ఈ ఆక్రమణలు తొలగింపు విషయంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ జి.నారాయణరావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వీఆర్‌వో నాగప్పారావు, సర్వేయరు రాజేష్ పాల్గొన్నారు.

అన్నదాన సత్రం కూల్చివేతకు కుట్ర – ఆలయ కమిటీ చైర్మన్ ధ్వజం... అన్నదాన సత్రం కూల్చివేయడానికి కొంత మంది వ్యక్తులు కుట్ర చేసి సత్రం ముందు భాగం కూల్చివేశారని, ఇది అన్యాయమని సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు ఆరోపించారు. ఎంతో మందికి మధ్యాహ్నం సమయంలో అన్నదానం చేస్తున్న సత్రంను ఎంతో మంది దాతల సహకారంతో నిర్మించామని తెలిపారు. ఆలయం ముందు భాగంలో విగ్రహాలను కూడా తొలగించారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని అమ్మతల్లినాయుడు పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పాడేరు: జిల్లాలోని పలు ఇంజనీరింగ్‌శాఖల పరిధిలో రూ.728 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభ శిలాఫలకాలను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆవిష్కరించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సుపరిపాలన–స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో రూ.600 కోట్ల ఉపాధి హామీ పనులకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రానున్న మూడేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు విస్తరించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారన్నారు. కిలో కాఫీ గింజలను రూ.525 ధరతో విక్రయించామన్నారు.

# జార్ఖండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో 2 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు

-ఏడు జిల్లాల్లో 318 కిలో మీటర్ల నెట్‌వర్క్
-కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూ ఢిల్లీ : రైల్వే మంత్రిత్వశాఖ రూ.6,405 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన రెండు ప్రాజెక్టు లకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిపిఇఎ) సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రెండు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు లకు ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులూ జార్కండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో ఏడు జిల్లాల మీదుగా సాగుతాయి. దీంతో ఇండియన్ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్ మరో 318 కిలోమీటర్ల మేర విస్తరిస్తుంది. కోడర్మా-బర్కాకానా డబ్లింగు (133 కిలోమీటర్లు) ప్రాజెక్ట్ సెక్షన్ జార్కండ్ లోని బొగ్గు ఉత్పాదక క్షేత్రం మీదుగా సాగుతుంది. దీనికి అదనంగా ఇది పాట్నా, రాంచీల మధ్య అన్నింటి కన్నా చిన్నదీ, ఎక్కువ సమర్థమైన రైలు లింకుగా కూడా ఉండ బోతోంది. బళ్లారి-చిక్‌జాజుర్ డబ్లింగు




(185 కిలోమీటర్లు) ప్రాజెక్ట్ లైను కర్ణాటక లోని బళ్లారి, చిత్రదుర్గ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా నుంచి సాగుతుంది. ఆమోదించిన మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుతో దాదాపు 28.19 లక్షల మంది జనాభాకు మేలు కలుగుతుంది. సుమారు 1,408 గ్రామాలకు కనెక్టివిటీ సదుపాయం పెరుగుతుంది.

# భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

బిజినెస్ వార్త: పసిడికి (గోల్డ్ ) మార్కెట్లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. అయితే పసిడి ధరలు గత కొంత కాలం నుంచి పరుగులు పెడుతున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. 10 గ్రాముల బంగారం ధర రూ. లక్ష కు చేరువలో ఉంది. జూన్ నెల ప్రారంభం లోనే బంగారం ధరలు భారీ ఎత్తున పెరిగాయి. తాజాగా భారతదేశంలో 24 క్యారెట్ల బంగారం గ్రాముకు రూ. 88 పెరిగి రూ. 9,928గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం గ్రాముకు రూ. 80 పెరిగి రూ. 9,100గా ఉంది. అలాగే 18 క్యారెట్ల బంగారం కూడా రూ. 66 పెరిగి రూ. 7,446గా ఉంది. పసిడికి మార్కెట్లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. అయితే పసిడి ధరలు గత కొంత కాలం నుంచి పరుగులు పెడుతున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. 10 గ్రాముల బంగారం ధర రూ. లక్షకు చేరువలో ఉంది. భారతదేశంలో బంగారం ధరలు.. ప్రస్తుతం 100 గ్రాముల బంగారం ధర 24 క్యారెట్లు రూ.9,92,800 గా ఉంది. అదే 22 క్యారెట్ల బంగారం ధర రూ.9,10,000.. 18 క్యారెట్లు రూ.7,44,600 గా ఉంది.
హైదరాబాద్‌లో బంగారం ధరలు.. నగరంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 99,280.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 91,000.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ. 74,460గా ఉంది. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ, విజయవాడ లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. వెండి ధరలు .. బంగారమే ముఖ్యంగా వెండి ధరలను నిర్ణయిస్తుంది. డిమాండ్ పెరిగితే బంగారం ధర కూడా పెరుగుతుంది, ఫలితంగా వెండి ధర కూడా పెరుగుతుంది. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు వెండిని వివిధ వస్తువులు అనగా, కంప్యూటర్లు, టీవీలు, మెడల్స్, నాణేలు ఇంక నగల వంటి తమ ఉత్పత్తులు తయారుచేయటంలో వాడతాయి. ఈ పరిశ్రమలు దాదాపు ప్రతిరోజూ ఏవో ఒక కొత్త ఉత్పత్తులు ప్రారంభిస్తాయి, దానివల్ల వెండి డిమాండ్ పెరిగి, ధరలు కూడా పెరుగుతాయి. హైదరాబాద్‌లో కేజీ వెండి రూ. 100 పెరిగి.. రూ. 1,18,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండికి రూ. 100 పెరిగి. రూ.1,08,900కు చేరింది. ఆర్థిక రాజధాని ముంబైలో కిలో వెండికి రూ. 100 పెరిగి. రూ.1,08,900 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడలో కేజీ ధర రూ.1,18,900గా ఉంది, విశాఖపట్నంలో కిలో వెండి ధర రూ. 1,18,900 వద్ద కొనసాగుతోంది.




# అణుచర్చల్లో ఇరాన్ దెబ్బకు తోకముడిచిన ట్రంప్

అమెరికా: ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకునేందుకు ఆ దేశంతో అమెరికా జరిపిన చర్చలు విఫలం కావడం పశ్చిమాసియాలో మరో సారి నిప్పుల కుంపటి రాజేసేలా కనిపిస్తోంది. ఇరాన్ తో జరిగిన చర్చల్లో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో అర్ధాంతరంగా వెనక్కి తగ్గిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పైకి వేరే కారణం చెబుతున్నా పశ్చిమాసియా నుంచి బలగాల్ని వెనక్కి పిలిపిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం సంచలనం రేపుతోంది. అమెరికాతో జరిగిన అణుచర్చలు విఫలమైన నేపథ్యంలో ఇరాన్ దీటుగా స్పందిస్తోంది. అణ్వస్త్ర కార్యక్రమాలు నిలిపేస్తే గతంలో విధించిన ఆంక్షలు ఎత్తేస్తామన్న హామీతో అమెరికాతో చర్చలు జరిపిన ఇరాన్ మరిన్ని హామీలు కోరింది. దీంతో అమెరికా వాటిని అంగీకరించకుండా చర్చల్ని ఆపేసి వెనక్కి తగ్గింది. దీంతో ఇరాన్ ఆగ్రహంగా ఉంది, చర్చలు విఫలమైన వేళ అమెరికా తమ బలగాలతో దాడులు చేస్తుందన్న భయాల్ని తోసిపుచ్చిన ఇరాన్. తమతో పెట్టుకుంటే ప్రత్యర్థికి తమ కంటే ఎక్కువ నష్టం చేసి తీరుతామని హెచ్చరించింది. ఈ హెచ్చరికలు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ను ఆత్మరక్షణలో పడేశాయి. ఇప్పటికే పశ్చిమాసియా దేశాల్లో వివిధ కారణాలతో మోహరించిన తమ బలగాల్ని అక్కడే కొనసాగిస్తే ఇరాన్ దాడి చేసే అవకాశాలు ఉన్నాయన్న భయంతో వాటిని వెనక్కి పిలిపిస్తూ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికా బలగాలు దాడులకు దిగితే వారి స్థావరాలు తమకు అందుబాటు లోనే ఉన్నాయన్న విషయం గుర్తుంచు కోవాలన్న ఇరాన్ హెచ్చరిక ప్రభావం తోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అమెరికా బలగాలు పశ్చిమాసియా దేశాలైన బహ్రెయిన్, కువైట్ నుంచి వెనుదిరుగుతున్నాయి. దీని పై స్వయంగా ట్రంప్ ను మీడియా ప్రశ్నిస్తే ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు లేవని, వాటిని సంపాదించుకునే అవకాశం ఆ దేశానికి ఇవ్వబోమని తేల్చేశారు. అటువంటప్పుడు పశ్చిమాసియా నుంచి బలగాల ఉపసంహరణ ఎందుకని ప్రశ్నిస్తే అమెరికా పౌరులకు తమ దేశంలోనే కాదు విదేశాల్లో సైతం భద్రత కల్పించాల్సిన బాధ్యత తమకు ఉందని చెప్పుకొచ్చారు. దీన్ని బట్టి చూస్తే ఇరాన్ తమ స్థావరాల పై దాడులు చేసి తమ బలగాలను మట్టు పెట్టే ప్రమాదం ఉందన్న భయం తోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అర్ధమవుతోంది.



# రెనాలిక్స్ నుంచి హెమోడయాలసిస్ మిషీన్

ముంబయి : స్వదేశీ ఎఐ ఆధారిత స్మార్ట్ హెమోడయాలసిస్ మెషీన్‌ను విడుదల చేసినట్లు రెనాలిక్స్ ప్రకటించింది. దీన్ని విస్తృత స్థాయిలో తయారీ సామర్థ్యాన్ని పెంపొందించు కోవడానికి వచ్చే నాలుగేళ్లలో రూ.800 కోట్లు పెట్టుబడుల వ్యయం చేయనున్నట్లు రెనాలిక్స్ హెల్త్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు శ్యామ్ వాసుదేవరావు తెలిపారు. పూర్తి స్వదేశీ, ఎఐ, క్లౌడ్-ఆధారిత ఆర్ఎక్స్‌టి21 స్మార్ట్ హెమోడయాలసిస్ మెషీన్ ప్రారంభ ధర రూ.6.70 లక్షలుగా నిర్ణయించామన్నారు. దిగుమతి చేసుకున్న యంత్రాల కంటే చాలా తక్కువ ధరకే లభిస్తుందన్నారు. ఇది ముఖ్యంగా కార్డియోవాస్కులర్, పల్మనరీ, తీవ్రమైన మూత్రపిండాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి నాణ్యమైన సంరక్షణను అందిస్తుందన్నారు.



# జిడిపి కి ప్రపంచ బ్యాంక్ కోత

-ఈ ఏడాది 6.3 శాతమే

న్యూ ఢిల్లీ : భారత వృద్ధి రేటు అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జిడిపి 6.3 శాతానికే పరిమితం కావొచ్చని తెలిపింది. ఇంత క్రితం జనవరిలో 6.7 శాతంగా అంచనా వేసింది. దీంతో పోల్చితే భారీ పతనమే చోటు చేసుకోనుంది. అదే విధంగా ప్రపంచ వృద్ధి రేటు 2.3 శాతానికి పడిపోనుందని తెలిపింది. 2025-26లో భారత వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలి మోనిటరీ పాలసీ కమిటీ రిపోర్టులో పేర్కొంది. దీంతో పోల్చినా ప్రపంచ బ్యాంక్ అంచనాలు మరింత తక్కువగా ఉండటం ఆర్థిక వ్యవస్థ పట్ల ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ బ్యాంక్ వాషింగ్టన్ లో గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. భారత ఎగుమతులు మంద గించడం ద్వారా జిడిపి పడిపోనుందని విశ్లేషించింది. పెట్టుబడుల వృద్ధి మందగిస్తోందని తెలిపింది. ఇది విధాన అనిశ్చితులను ప్రతిబింబిస్తుందని తెలిపింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక అనిశ్చితి, టారిఫ్ ఆందోళనలు జిడిపిని దెబ్బ తీస్తున్నాయని పేర్కొంది. వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో సగటున 6.6 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. సర్వీసు సెక్టార్ కార్యకలాపాల ఎగుమతులు కొంత జిడిపికి మద్దతును ఇవ్వొచ్చని పేర్కొంది. దక్షిణాసియాలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్ లో కార్యకలాపాలు మందగించాయి. ఇది పారిశ్రామిక ఉత్పత్తిలో మంద గమనాన్ని ప్రతిబింబిస్తుంది. స్థిరమైన సేవల కార్యకలాపాలను, వ్యవసాయ ఉత్పత్తిలో పునరుద్ధరణను ప్రతిబింబిస్తుంది. పెరిగిన వాణిజ్య ఉద్రిక్తతలు, విధాన అనిశ్చితి ఈ ఏడాది ప్రపంచ వృద్ధిని మందగించేలా చేస్తోంది. ఇందులో ప్రపంచ మాంద్యాలను పూర్తిగా పరిగణ లోకి తీసుకోలేదు అని ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్ పేర్కొంది. ఈ ఏడాది ప్రపంచ వృద్ధి రేటు 2.3 శాతానికి పడిపోనుందని ప్రపంచ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ ఇండెర్మిట్ గిల్ తన బ్లాగ్ లో పేర్కొన్నారు. గడిచిన 17 ఏళ్లలోనే ఇది అత్యంత బలహీనమైన వృద్ధి కానుందని పేర్కొన్నారు. 2027 నాటికి సగటున 2.5 శాతంగా ఉండొచ్చన్నారు. అదే జరిగితే 2020 దశాబ్దం జిడిపి 1960 కనిష్ట స్థాయిని చవి చూడనుందన్నారు.




# నెయ్యి మంచిదే కానీ ఈ 5 పదార్థాలతో కలిస్తే విషం అవుతుంది

ఇంటర్నెట్ డెస్క్ : నెయ్యి మన ఆరోగ్యానికి చాలా మంచిది. మన శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు దానిలో పుష్కలంగా ఉన్నాయి. అయితే, నెయ్యితో కలిపి తినకూడని కొన్ని ఆహారాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. నెయ్యి ఆరోగ్యానికి చాలా మేలు చేసే ఆహారం. దీంట్లో విటమిన్ ఏ, డి, ఈ, కే లతో పాటు పోషకాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. అంతే కాకుండా, ఇది యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటుంది. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. నెయ్యి జీర్ణక్రియను మెరుగు పరచడానికి, పేగు ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుంది. శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. చర్మ సంరక్షణ లోనూ సహాయపడుతుంది. అంతే కాకుండా, జుట్టుకు పోషకాలు అందిస్తూ జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రించడంలో, గుండె సంబంధిత వ్యాధులను నివారించడంలో ఉపయోగపడుతుంది. కానీ నెయ్యిని మితంగా తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. అయితే, నెయ్యితో కలిపి తినకూడని కొన్ని ఆహారాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. తేనె: నెయ్యి, తేనె రెండూ ఆరోగ్యానికి చాలా మంచివని భావిస్తారు. కానీ ఆయుర్వేదం ప్రకారం, రెండింటినీ కలిపి తీసుకోవడం మంచిది కాదు. ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో విషపదార్థాలు ఏర్పడతాయి. ఇది జీర్ణక్రియను ప్రభావితం చేస్తుంది. టీ లేదా కాఫీ: టీ లేదా కాఫీలో నెయ్యి కలిపి ఎప్పుడూ తాగకూడదు. ఇది మన జీర్ణక్రియను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల ఆమ్లత్వం లేదా ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. చేప: మన ఆయుర్వేదంలో నెయ్యి, చేపలను కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. వేడిగా ఉన్న నెయ్యిని, చల్లగా ఉన్న చేపలను కలిపి తింటే అది జీర్ణక్రియ, చర్మ సమస్యలను కలిగిస్తుంది. పెరుగు: నెయ్యి, పెరుగు రెండూ కూడా పాలతో తయారవుతాయి. కానీ, వాటిని కలిపి తీసుకోకూడదు. ఎందుకంటే, రెండూ ఒకదానికొకటి పూర్తిగా వ్యతిరేకం. నెయ్యిని వేడిగా, జిడ్డుగా పరిగణిస్తారు. పెరుగును చల్లగా పరిగణిస్తారు. రెండింటినీ కలిపి తినడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. ముల్లంగి: ఆయుర్వేదం ప్రకారం ముల్లంగి, నెయ్యిని కలిపి తినకూడదు. ఎందుకంటే, ముల్లంగిలో ఉండే లక్షణాలు, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులతో విభేదిస్తాయి. ఇది జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. కడుపులో అసౌకర్యం, ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. ఈ రెండింటినీ వేర్వేరుగా తింటేనే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు అంటున్నారు.



# మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన టాటా గ్రూప్

అహ్మదాబాద్: గుజరాత్ లోని అహ్మదాబాద్ లో విమాన ప్రమాద ఘటన పై ఎయిరిండియా యాజమాన్యం అయిన టాటా గ్రూప్ స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నీ తామీ భరిస్తామని పేర్కొంది. జే మెడికల్ కాలేజ్ భవనాన్ని పునర్నిర్మిస్తామని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎయిరిండియా ప్రమాద ఘటన మమ్మల్ని తీవ్రంగా కలిచివేసిందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఆ బాధను వ్యక్తపరచడానికి కూడా మాటలు రావడం లేదన్నారు. ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ నుండి 242 మంది ప్రయాణికులతో లండన్ కు బయలుదేరిన కొన్ని క్షణాల్లోనే కూలిపోయింది. చాలా మంది ప్రయాణికులు బతికే అవకాశం లేదని భావిస్తున్నారు. ఎయిర్ ఇండియా తన ట్విట్టర్ పేజీలో నల్లటి డీపీతో తన సంతాపాన్ని వ్యక్తం చేసింది. గుజరాత్ లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం మధ్యాహ్నం 1.43 గంటలకు కూలిపోయింది. జూన్ 12 న మధ్యాహ్నం 1.38 గంటలకు అహ్మదాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి విమానం బయలుదేరింది. ఈ విమానంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ఉన్నారు. దీని తర్వాత, అహ్మదాబాద్ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, తరువాత తిరిగి తెరిచారు. సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. విమానంలో 11 ఏ సీటులో ప్రయాణిస్తున్న విశ్వాస్ కుమార్ అనే ప్రయాణీకుడు ప్రమాదం నుండి బయటపడినట్లు చెబుతున్నారు. అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత, ఎయిర్ ఇండియా తన సోషల్ మీడియా పేజీల హోమ్‌పేజీని నలుపు రంగు లోకి మార్చింది.






# నితీష్ ఏ కావాలంటున్న టీమిండియా కోచ్



పెన్ సత్తా క్రీడలు : తెలుగు తేజం నితీష్ రెడ్డిలో అపూర్వ ప్రతిభ దాగి ఉందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ అన్నాడు. బ్యాటింగే కాదు బౌలింగ్ లోనూ అతడు అద్భుతాలు చేయగలడని చెప్పాడు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. దొరికిన ప్రతి అవకాశాన్ని రెండు చేతులా వినియోగించు కుంటున్నాడు. టెస్టులతో పాటు ఇతర ఫార్మాట్లలోనూ టీమిండియాలో తన స్థానాన్ని పదిలం చేసుకోవాలని చూస్తున్నాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ సిరీస్ కోసం సన్నద్ధమవుతున్న నితీష్ ఈ సిరీస్‌లో చెలరేగి ఆడాలని భావిస్తున్నాడు. ఐపీఎల్-2025 ఫెయిల్యూర్ ను అందరూ మర్చిపోయేలా చేయాలని కసితో ఉన్నాడు. ఈ తరుణంలో అతడ్ని పొగడ్తల్లో ముంచెత్తాడు భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్. నితీష్ లో అపూర్వ ప్రతిభ దాగి ఉందన్నాడు. బ్యాట్ తోనే కాదు, బంతి తోనూ అతడు మ్యాజిక్ చేయగలడని తెలిపాడు. జట్టుకు తెలుగోడి అవసరం ఉందన్నాడు. మ్యాజికల్ డెలివరీస్ వేసే టాలెంట్ అతడిలో ఉంది. అయితే నిలకడగా బంతులు వేయడం చాలా ముఖ్యం నితీష్ నుంచి మేం అదే కోరుకుంటున్నాం. కెరీర్‌లో ఎదగాలంటే అతడికి కూడా అదే కీలకం, నితీష్ తో తరచూ బౌలింగ్ ప్రాక్టీస్ చేయిస్తున్నాం.



సవాళ్లు సంధించే బంతులు వేయమని అతడ్ని చాలెంజ్ చేశా, అతడు తరచూ బౌలింగ్ చేయాలనేది నా కోరిక. బ్యాటింగ్ తో పాటు బౌలింగ్ కూడా చేయగలిగే సామర్థ్యం ఉన్న నితీష్ లాంటి ప్లేయర్లు ఉండటం జట్టుకు ఎంతో మేలు చేస్తుంది. బౌలింగ్ లో అతడు మ్యాజిక్ చేస్తాడని నమ్ముతున్నా అని మోర్కెల్ చెప్పు కొచ్చాడు. ఇంగ్లండ్‌తో తలపడే భారత జట్టు అన్ని విభాగాల్లోనూ సమతూకంగా ఉందని బౌలింగ్ కోచ్ పేర్కొన్నాడు. గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నామని, అయితే వాటిని మైదానంలో ఎలా అమలు పరుస్తారనే దాని మీదే ఫలితం ఆధారపడి ఉంటుందన్నాడు మోర్కెల్.

# 6 వికెట్లతో చెలరేగిన కెప్టెన్ కమిన్స్ దక్షిణాఫ్రికా 138 ఆలౌట్



లార్డ్స్ : ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియా అదరగొడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకే ఆలౌట్ అయినప్పటికీ.. తర్వాత దక్షిణాఫ్రికాను కూడా తక్కువ స్కోరుకే పరిమితం చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 138 రన్స్‌కే ఆలౌట్ అయింది. దీంతో ఆసీస్‌కు 74 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఏకంగా 6 వికెట్లతో చెలరేగాడు. లార్డ్స్ మైదానంలో జరుగుతున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలిరోజు దక్షిణాఫ్రికా పేసర్ల ధాటికి, ఆస్ట్రేలియా 212 రన్స్ మాత్రమే చేయగా అనంతరం సౌతాఫ్రికా బ్యాటర్లు కూడా వరుస పెట్టి పెవిలియన్ చేరారు. రెండో రోజు ఆరంభంలో దక్షిణాఫ్రికా కాస్త పోరాటం చూపినప్పటికీ, చివరికి 138 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో కంగారూ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పట్టు బిగిస్తోంది. సౌతాఫ్రికా బ్యాటర్లలో బెడింఘమ్ (45) టాప్ స్కోరర్. ఆ జట్టు కెప్టెన్ బవుమా 36 పరుగులతో రాణించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్ 6 వికెట్లు పడగొట్టాడు. 43-4 స్కోరుతో రెండో రోజు ఆట ప్రారంభించిన సౌతాఫ్రికాను బవుమా, బెడింఘమ్ ఆదుకున్నారు. ఓపికతో ఆడుతూ స్కోరు బోర్డును మెల్లగా ముందుకు తీసుకెళ్లారు. ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఈ క్రమం లోనే ఐదో వికెట్‌కు 64 పరుగులు జోడించాక కమిన్స్ ఆసీస్ కు మంచి బ్రేక్ త్రూ ఇచ్చాడు. అతడి బౌలింగ్‌లో లబుషేన్ అద్భుత క్యాచ్ తో బవుమా పెవిలియన్ చేరాడు. తర్వాత వెరిన్ (13) కాస్త నిలదొక్కుకున్నట్లే కనిపించినా 13 పరుగులకే వెనుదిరిగాడు. ఇక బెడింఘమ్ ఒక వైపు క్రీజులో పాతుకుపోయినా మరో ఎండ్‌లో సహకరించే వారే లేకపోయారు. ఈ క్రమం లోనే వేగంగా ఆడే క్రమంలో అతడు కూడా 8 వ వికెట్‌గా వెనుదిరిగాడు. బెడింఘమ్ అవుటయ్యాక 10 బంతుల్లోపే సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. అంతకు ముందు తొలి రోజు ఆటలో కూడా పేసర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ బావుమా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న నిర్ణయం సరైందని నిరూపిస్తూ, కగిసో రబాడ (5/51), మార్కో యాన్సెన్ (3/49) ఆస్ట్రేలియా బ్యాటర్లను హడలెత్తించారు. సీమ్, స్వింగ్ కు సహకరిస్తున్న పిచ్ పై వీరిద్దరి ధాటికి ఆస్ట్రేలియా 212 రన్స్‌కే ఆలౌట్ అయింది. ఆల్ రౌండర్ వెబ్‌స్టర్ (72) టాప్ స్కోరర్ కాగా స్టీవ్ స్మిత్ కూడా 66 పరుగులతో రాణించాడు. ఐదో వికెట్‌కు స్మిత్, వెబ్‌స్టర్ 79 పరుగులు జోడించారు. ఆఖరి సెషన్‌లో దక్షిణాఫ్రికా మళ్లీ పుంజుకుంది. ఆస్ట్రేలియాను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసినా దక్షిణాఫ్రికా తొలి రోజును నిరాశగానే ముగించింది. బ్యాటుతో ఆ జట్టు కంగారూల కంటే ఎక్కువగా తడబడింది. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ చెలరేగడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 43 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. స్టార్క్ ఓపెనర్లిద్దరినీ అవుట్ చేసిన స్టార్క్ దక్షిణాఫ్రికాను గట్టి దెబ్బతీశాడు. ఇక రెండో రోజు కమిన్స్ చెలరేగి సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు.



# గోపీచంద్ కొత్త సినిమా గ్లింప్స్ విడుదల

పెన్ సత్తా సినిమా : టాలీవుడ్ కథానాయకుడు గోపి చంద్, దర్శకుడు సంకల్ప్ రెడ్డి కొత్త సినిమా గ్లింప్స్ విడుదలయ్యాయి. గురువారం ఆయన పుట్టినరోజు సందర్భంగా నిర్మాతలు విడుదల చేశారు. గోపీ చంద్ 33 పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్‌ను ఇంకా ప్రకటించలేదు. చిట్టూరి శ్రీనివాస ఈ మూవీని నిర్మిస్తున్నారు. త్వరలో మరిన్ని వివరాలు ప్రకటించ నున్నారు. భారతీయ చరిత్రలో అనేక కీలకఘట్టాల ఆధారంగా ఈ సినిమాను దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. సంకల్ప్ రెడ్డి గతంలో ఘాజీ, అంతరిక్షం చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. చాలా గ్యాప్ తర్వాత ఆయన నుంచి ఈ సినిమా రానుంది.







# వ్యూస్ విషయంలో అభిమానుల్ని దారుణంగా మోసం చేస్తున్న హీరోలు

పెన్ సత్తా సినిమా: తెలుగులో స్టార్ హీరోలు ఎక్కువ. ఏ భాషలో లేనంతమంది స్టార్లు మన తెలుగు లోనే ఉన్నారు. దీంతో సహజంగానే ఒకరి పై మరొకరికి పోటీ ఉంటుంది. ఈ పోటీ ప్రపంచంలో తామే నెంబర్ వన్ అనిపించు కోవాలని ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రధానంగా హీరో లకు సంబంధించిన సినిమాల టీజర్లు, ట్రైలర్లు విడుదలైనప్పుడు యూట్యూబ్ లో లక్షల సంఖ్యలో, కోట్ల సంఖ్యలో వ్యూస్ లు వస్తుంటాయి. దీంతో ఫలానా హీరో సినిమాకు బ్రహ్మాండ మైన వ్యూస్ వచ్చాయని, అదే ఇప్పటి వరకు నెంబర్ వన్ అంటూ వార్తలు వస్తాయి. దీంతో అందరూ నిజమే అని నమ్ముతారు. దిల్ రాజు చేసిన వ్యాఖ్యలు గుట్టు విప్పేశాయి అయితే ఇక్కడే హీరో, నిర్మాత, దర్శకుడు అభిమానులను మోసం చేస్తున్నారు. వ్యూస్ ను కొనేస్తున్నారు. అవేమీ ఫేక్ వ్యూస్ కాదు. ఫోర్స్ డ్ వ్యూస్ అంటారు వీటిని. ప్రజలకు ఆసక్తి ఉన్నా, లేకున్నా చూసేలా చేయడమే. యూ ట్యూబ్ కు డబ్బులు చెల్లించి యాడ్ లు రన్ చేయిస్తారు. ఆ యాడ్స్ ను తమకు కావల్సిన ప్రాంతాల్లో ప్రజలకు కనిపించేలా వీటిని యూట్యూబ్ రన్ చేస్తుంది. అలా ట్రైలర్ మీద క్లిక్ పడేలా చేయడంవల్ల వ్యూస్ పెరుగుతాయి. అయితే దాని పై క్లిక్ పడినంతమాత్రాన వ్యూస్ వచ్చినట్లు కాదు, రానట్లు కాదు. ఏదేమైనప్పటికీ నితిన్ నటించిన తమ్ముడు సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో నిర్మాత దిల్ రాజు చేసిన వ్యాఖ్యలు అసలు గుట్టు విప్పేశాయి. అటువంటి ఫాల్స్ బతుకులు మనకొద్దని, వచ్చిందేదో వాస్తవంగా ఉంటే చాలని, మనం వాస్తవాలు తెలుసుకుంటే చాలన్నారు. అభిమానుల వల్లే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామనేదాన్ని గుర్తెరగాలి, అసలు వ్యూస్ ను బట్టి ట్రైలర్ అయినా, టీజర్ అయినా ఎలా ఉంటుంది అనే విషయం పై నిర్మాతకు, దర్శకుడికి ఓ స్పష్టత వస్తుంది. తర్వాత థియేటర్ లో ఈ సినిమా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుంది? ఎంత మందిని రాబట్టగలదు అనే విషయం కూడా తెలుస్తుంది. అలా కాకుండా లక్షలకు లక్షల వ్యూస్ వచ్చాయంటూ వాస్తవాన్ని మరుగున పెట్టుకొని ఇప్పటివరకు దారుణంగా నష్టపోయామని దిల్ రాజుకు అర్థమైంది. ఇతర నిర్మాతలు, హీరోలు కూడా ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే చాలు. అభిమానులవల్లే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకొని వారిని మోసం చేయకుండా ఉంటే చాలంటున్నారు సినీ విశ్లేషకులు.



# పవర్ ఫుల్ రోల్స్ కి కేరాఫ్ గా అనుష్క



పెన్ సత్తా సినిమా : టాలీవుడ్ ను ఏలేసి కాస్తంత గ్యాప్ ఇచ్చిన ముద్దు గుమ్మ తిరిగి రేస్ లోకి వచ్చేస్తోంది. ఇన్నాళ్లు సైలెంట్ మోడ్ లో ఉన్న స్వీటీ పవర్ ఫుల్ రోల్స్ కు కేరాఫ్ గా మారుతోంది. టాలీవుడ్ ను ఏలేసి కాస్తంత గ్యాప్ ఇచ్చిన ముద్దుగుమ్మ తిరిగి రేస్ లోకి వచ్చేస్తోంది. ఇప్పటికే తన మేనియాను కొనసాగించిన బ్యూటీ ఇప్పుడు అంతకు మించిన రోల్ చేయబోతుండటం సెన్సేషన్ గా మారింది. అనుష్క శెట్టి టాప్ హీరోలతో జోడీ కట్టడమే కాదు, పవర్ రోల్స్ కు కేరాఫ్ గా మారింది. తనదైన యూనిక్ యాక్టింగ్‌తో విమర్శకుల ప్రశంసలను అందుకుంటోంది. ముఖ్యంగా హీరోలకు దీటుగా ఇమేజ్ సంపాదించుకుని ఆడియెన్స్ ని థియేటర్లకు రప్పించు కోగలుతోంది. తన లాంగ్ కెరీర్‌లో ఎన్నో మైలు రాళ్ళ వంటి చిత్రాలను చేసిన జేజమ్మ కెరీర్ ఒకానొక దశలో ముగింపు కొచ్చిందనే కామెంట్స్ వినిపించాయి. కట్ చేస్తే అంతకు మించి శక్తివంతమైన పాత్రలు ఆమె తలుపు తడుతున్నాయి. ప్రెజెంట్ అలాంటి రోల్ తో మరోసారి మాయ చేయడానికి రెడీ అవ్వడం హాట్ టాపిక్ గా మారింది. ఒక అరుంధతి పాత్ర చేయాలన్నా దేవసేన క్యారెక్టర్ చేయాలన్నా రుద్రమదేవి గా నటించాలన్నా, భాగమతి పాత్రలో జీవించాలన్నా ఒకే ఒక్క హీరోయిన్ వల్ల అవుతోంది. ఆ హీరోయిన్ ఎవరో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదనుకుంటా.. అది వన్ అండ్ ఓన్లీ అనుష్క శెట్టి. రీసెంట్ గా ఘాటీ తో మరోసారి ఆడియెన్స్ ను మెస్మరైజ్ చేయడానికి రెడీ అవుతోంది. ఇప్పటికే చాలా సినిమాల్లో పవర్ రోల్స్ లో నటించిన స్వీటీ. ఈ సినిమాలో అంతకు మించి కనిపించ బోతుందని గ్లింప్స్ చూస్తే అర్థమైంది. పాడేరు బ్యాక్ డ్రాప్ లో సర్వైవల్ యాక్షన్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ మూవీలో అనుష్క వయెలెంట్ గా కనిపించనుంది. బయటకు వచ్చిన ప్రమోషల్ వీడియోలో బస్ మిర్రర్ లో చూస్తూ కసిగా విలన్ గొంతు కోయడం, ఆ తర్వాత తలని చేత్తో తీసుకెళ్లి తాపీగా బంగ్ తాగుతూ రిలాక్స్ అయిన సీన్లు సినిమా పై అంచనాలు పెంచేశాయి. ఈ సినిమాతో మరోసారి హిట్ పక్కా అనుకుంటున్న టైంలో మరో చిత్రంలో సూపర్ రోల్ కొట్టేసినట్లు టాక్ నడుస్తోంది. లేటెస్ట్ సమాచారం ప్రకారం కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ సినిమాటిక్ యూనివర్స్ లోకి అనుష్క ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఎల్.యు.సి.లో భాగంగా తెరకెక్కనున్న 'ఖైదీ-2 లో ఛాన్స్ కొట్టేసిందట. ఈ మూవీలో లేడీ డాన్ గా అనుష్క కనిపించ బోతుందట. ఈ క్యారెక్టర్ సినిమాకే హైలెట్ గా ఉండనుందని రఫ్ అండ్ రగ్గడ్ లుక్ లో స్వీటీ కనిపించనుందని తెలుస్తోంది. ఇక కరెక్ట్ గా చెప్పాలంటే కార్తీ ప్లే చేసిన దిల్లీ రోల్ కు దీటుగా అనుష్క రోల్ ఉంటుందని టాక్. ఇప్పటికే ఈ రోల్ కు దేవసేన కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నెవర్ బిఫోర్ అనేలా డిజైన్ చేస్తున్నాడట లోకేష్. ప్రెజెంట్ లోకేష్ రజనీకాంత్ తో తెరకెక్కించిన 'కూలీ ఆగస్ట్ 14 న విడుదల కాబోతోంది. ఈ సినిమా విడుదల కాగానే 'ఖైదీ 2 పై ఫోకస్ పెడతాడట. నిజంగా లోకేష్ డెన్ లోకి అనుష్క ఎంట్రీ ఇస్తే ఆమె కెరీర్ కు ఈ మూవీ మరింత ప్లస్ అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.

"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com